## 16 నుంచి 19 వరకు పెద్దగట్టు జాతర...

హైదరాబాద్,ఫిబ్రవరి11: సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలం పెద్దగట్టు జాతర ఈనెల 16 నుంచి 19 వరకు జరగనుంది. యాదవుల కులదైవం పెద్దగట్టు లింగమంతులస్వామి ఇక్కడ పూజలందుకోనున్నాడు. జాతరకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. జాతర ఏర్పాట్ల కోసం ఇటీవల రూ.5 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. ఈ జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటుగా.. ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు వస్తుంటారు. ఈ ఏడాది 10-15 లక్షల మంది భక్తులు స్వామిని దర్శించుకుంటారని అంచనా. జాతర నేపథ్యంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై ప్రయాణించేవారికి ట్రాఫిక్ అలర్ట్ జారీ చేశారు. 65వ జాతీయ రహదారిపై వాహనాల దారి మళ్లింపు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈనెల 16న తెల్లవారుజాము నుంచి దారి మళ్లింపు, ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని చెప్పారు. వాహనదారులు సహకరించాలని కోరారు.


# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :301 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేదీ: బుధవారం 12-02-2025 | పేజీలు:4 వెల: 2.00


# రైతుల కోసం ఎంతటి పోరాటాలైనా సిద్ధం...



సిద్దిపేట,ఫిబ్రవరి11:రైతుల కోసం ఎంతటి పోరాటాలు చేయటానికైనా సిద్ధంగా ఉన్నామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడంలో రేవంత్ ప్రభుత్వం విఫలమైందని హరీష్‌రావు ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రైతుల కోసం తాము నిరంతర పోరాటం కొనసాగిస్తామని, రైతుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం సలేంద్రి గ్రామంలో రంగనాయక సాగర్ కాలువను పరిశీలించారు. కాలువలో ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి సంతోషించారు. రైతులకు సాగునీరు అందడంపై హర్షం వ్యక్తం చేస్తూ, కాలువ పక్కన ఆగి సెల్ఫీ దిగారు. అనంతరం స్థానిక రైతులతో ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మెట్టుపల్లి గ్రామంలోని పొద్దుతిరుగుడు (సన్‌ఫ్లవర్) తోటలను సందర్శించి, అక్కడి రైతులతో ముఖాముఖిలో చర్చించారు. రైతులు మార్కెటింగ్ సమస్యలను, పంటకు సరైన ధరలేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించగా, తక్షణమే ప్రభుత్వం సత్వర చర్యలు తీసుకోవాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు. సన్‌ఫ్లవర్ పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని హరీష్‌రావు స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు గిట్టుబాటు ధర అందించాలని అన్నారు. రైతుల అవగాహన కోసం పంట వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి, మార్కెట్ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగునీరు అందించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించడం వల్లే ఇప్పుడు పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని చెప్పారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఈ ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని హరీష్‌రావు గుర్తు చేశారు.

# మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకంపై గుత్తా సుఖేందర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

నల్లగొండ: మదర్ డెయిరీ ఆస్తుల అమ్మకం మంచి నిర్ణయం కాదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. అప్పులు, నష్టాల నుంచి బయటపడాలంటే ఆస్తుల అమ్మకమే పరిష్కారం కాదని సూచించారు. నిర్వహణ, ఓవర్ హెడ్ ఖర్చు తగ్గించుకోవాలన్నారు. కోఆపరేటివ్ వ్యవస్థలో ప్రతిఒక్కరు నిజాయితీగా పనిచేయాలన్నారు. నల్లగొండలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సంస్థకు నష్టాలు వస్తుంటే 250 మందిని పర్మినెంట్ చేశారని విమర్శించారు. ఇది అదనపు ఖర్చని, ఇలాంటివి తగ్గించుకుని సంస్థను కాపాడాలన్నారు. రైతులను కాపాడాలని చెప్పారు. అమ్ముకుంటూ పోతే ఏదోఒక రోజు మదర్ డైరీని కూడా అమ్మే పరిస్థితి వస్తుందన్నారు. ఆస్తుల అమ్మకంపై ప్రభుత్వం, డెయిరీ నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. తాను 8 సంవత్సరాలు డెయిరీ చైర్మన్‌గా పనిచేశానని, ఫెడరేషన్ నుంచి నార్మల్‌గా ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. సంస్థను రూ.5 కోట్ల నష్టాల నుంచి లాభాల బాట పట్టించామన్నారు. కాగా, కులగణన అనేది చారిత్రాత్మక నిర్ణయమని చెప్పారు. ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణలో కులగణన జరిగిందన్నారు. 50 రోజుల్లోనే 97 శాతం ప్రజలు కులగణనలో వివరాలు నమోదు చేసుకున్నారని తెలిపారు. అయితే ఓటర్ జనాభాకి, సర్వే లెక్కలుకు పొంతన కుదరలేదని వెల్లడించారు. ఒక్కొక్కరు



రెండు చోట్లా ఓటు హక్కు కలిగి ఉండటమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. ఏ పథకం అమలుచేసినా లేకున్నా తప్పనిసరిగా రైతు భరోసా అందజేయాలని ప్రభుత్వానికి సూచించారు. రాష్ట్రంలో పంటల అధిక ఉత్పత్తికి రైతు భరోసా కూడా కారణమన్నారు. కులాల పేరుతో ఏ సభ్యుడు వ్యాఖ్యలు చేసినా అది అనైతికమని చెప్పారు. అన్ని కులాలు, మతాలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందని వెల్లడించారు.

# జోర్డాన్,ఈజిప్ట్‌లకు ట్రంప్ హెచ్చరిక..

వాషింగ్టన్,పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇప్పటికే హమాస్-లెబనాన్-ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య తీవ్రస్థాయిలో యుద్ధం జరిగింది. ఇక ఈ మధ్య కాలంలోనే హమాస్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం జరిగి.. ఇరు పక్షాలు బందీలు విడుదల చేయడం.. ఖైదీలను అప్పగించుకోవడం జరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో అమెరికా అధ్యక్షుడు గాజాను స్వాధీనం చేసుకుంటామని.. పాలస్తీనియులు ఖాళీ చేసి వెళ్లిపోవాలని హెచ్చరించారు. అంతేకాదు.. శనివారంలోగా ఒకేసారి ఇజ్రాయెల్ బందీలను విడుదల చేయకపోతే.. హమాస్ నరకం చూస్తుందని తీవ్ర వార్నింగ్ ఇచ్చారు. ఇదిలా ఉంటే తాజాగా ట్రంప్.. జోర్డాన్, ఈజిప్ట్‌లకు హెచ్చరికలు జారీ చేశారు. గాజా నుంచి వచ్చే పాలస్తీనియన్లను చేర్చుకోవాలన్నారు. లేదంటే సాయం నిలిపివేస్తామని ట్రంప్ హెచ్చరించారు. గాజాను తిరిగి అభివృద్ధి చేస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. అక్కడ ప్రజలను మిత్రదేశాలైన జోర్డాన్, ఈజిప్ట్‌లు చేర్చుకోవాలని ట్రంప్ సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జోర్డాన్ రాజు అబ్దుల్లాతో ట్రంప్ సమావేశం కానున్నారు. ఈ సందర్భంగా జోర్డాన్ రాజుపై ట్రంప్ ఒత్తిడి తెచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. అయితే గాజా నుంచి వచ్చే పాలస్తీనియన్లను శాశ్వతంగా తీసుకోవాలని జోర్డాన్, ఈజిప్టులపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ ప్రతిపాదన తిరస్కరిస్తే మాత్రం.. సహాయాన్ని నిలిపివేయనున్నట్లు ది న్యూయార్క్ టైమ్స్ తెలిపింది. ప్రస్తుతం అమెరికా నుంచి జోర్డాన్, ఈజిప్ట్ దేశాలు సైనిక మరియు ఆర్థిక సహాయాన్ని పొందుతున్నాయి.



ఈ నేపథ్యంలోనే గాజాను స్వాధీనం చేసుకుంటే.. ఈ పాలస్తీనియన్లను మిత్ర దేశాలైన జోర్డాన్, ఈజిప్ట్ దేశాలకు తరలించాలని ట్రంప్ భావిస్తున్నారు. ఒకవేళ ఈ ప్రతిపాదనకు ఆ రెండు దేశాలు అంగీకరించకపోతే మాత్రం సాయం నిలిపివేసేందుకు ట్రంప్ ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంది. అయితే ట్రంప్ ప్రతిపాదనకు ఆ రెండు దేశాలు సిద్ధంగా లేవన్నట్టుగా తెలుస్తోంది. ట్రంప్ ప్రతిపాదనను జోర్డాన్, ఈజిప్ట్ దేశాలు తిరస్కరించనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ట్రంప్ ఆలోచన విధానాన్ని ప్రపంచ దేశాలు తప్పుపడుతున్నాయి. మరోసారి ఉద్రిక్తతలు సృష్టించేవిగా ఉన్నాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# ఆఫీసుల్లో ఫైళ్ల క్లియరెన్స్‌లో వేగం పెంచాలి




అమరావతి,ఫిబ్రవరి11: ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ-ఆఫీసులో ఫైళ్లు క్లియరెన్సులో వేగం పెరగాలని, ఫైళ్లు ఎక్కడికక్కడ క్లియర్ కాకుండా ఆగిపోతున్నాయనేదానిపైన కార్యదర్శులు, శాఖల విభాగాధిపతులు సమీక్ష చేసుకోవాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని వాటిని తొలగించి ఫైళ్లు త్వరితగతిన పరిష్కారం చేయాలన్నారు. ఫైళ్లలో ఆర్థిక, ఆర్థికేతర అనే రెండు రకాల ఫైళ్లుంటాయని, ఆర్థికేతర ఫైళ్ల పరిష్కారంలో ఫైళ్లు ఎట్టి పరిస్థితిలోనూ పెండింగ్‌లో ఉండకూడదన్నారు. ఆర్థిక పరమైన ఫైళ్లు అయితే ఆయా శాఖల్లోని బడ్జెట్ తదితర అంశాలను సమీక్షించుకుని ఫైళ్లను త్వరితగతిన సమీక్షించాలన్నారు. కొన్ని శాఖల్లో కొంతమంది అధికారులు తమ వద్ద ఫైళ్లను ఆరు నెలలు, ఏడాది వరకు ఉంచుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని ప్రభుత్వ శాఖల్లో సగటున మూడు రోజుల్లోనే ఫైళ్లు క్లియరెన్సు అవుతున్నాయని, మరికొన్ని శాఖల్లో ఫైళ్లు ఆలస్య అవుతున్నాయని ఆర్టీజీఎస్ సీఈవో దినేష్ కుమార్ వివరణ ఇచ్చారు. కాగా గిరిజన హక్కుల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 1/70 చట్టాన్ని తొలగించే ఉద్దేశ్యం లేదని స్పష్టం చేశారు. గిరిజన జాతుల అస్థిత్వాన్ని కాపాడుకోవడం అంటే భారతీయ సంస్కృతిని కాపాడుకోవడమేనని తాము బలంగా నమ్ముతున్నామని చెప్పారు. అందుకే వారి విద్య, వైద్యం, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి తాము నిరంతరం పనిచేస్తున్నామని అన్నారు. ఈ మేరకు సోషల్ మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు స్పందించారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక కార్యక్రమాలు అందించామని గుర్తుచేశారు. యాక్ట్ 1/70 మార్చే ఆలోచన ప్రభుత్వానికి లేదని, 1/70 యాక్ట్‌ను పరిరక్షిస్తామని, ఆదివాసి చట్టాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, గిరిజనులు ఆందోళన చెందవద్దని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు విషప్రచారం చేస్తూ.. అసత్యాలు చెప్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. గిరిజనులకు మెరుగైన సంక్షేమం అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందన్నారు. 5 ఏళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో జగన్ గిరిజనుల జీవితాలతో ఆడుకున్నారని, అటవీ ప్రాంతాలను గంజాయికి అడ్డాగా మార్చిన వైఎస్సార్‌సీపీ నేతలు గిరిజనుల ఉపాధికి గండి కొట్టారని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్‌గా మార్చటంతో పాటు గిరిజనులకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటోందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

# సీఎం రేవంత్‌తో మందకృష్ణ భేటీ.. ఎస్సీ వర్గీకరణపై చర్చ



హైదరాబాద్,ఎస్సీ వర్గీకరణ, రిజర్వేషన్లపై సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ. మంగళవారం ముఖ్యమంత్రి నివాసానికి మందకృష్ణతోపాటు ఎస్సీ వర్గానికి చెందిన పలువురు నేతలు ఉన్నారు. షెడ్యూల్డు కులాల వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ సిఫారసులను శాసనసభ ఆమోదించింది. కమిషన్ చేసిన సిఫారసుల్లో క్రిమీలేయర్ ప్రతిపాదనను తిరస్కరించింది. మిగతా వర్గీకరణ ప్రతిపాదనలను శాసనసభ ఇటీవల ఆమోదించిన విషయం తెలిసిందే. రాజకీయ ప్రయాజనాలకు అతీతంగా, మాదిగ ఉపకులాలకు మేలు చేయాలనే మంచి లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. అసెంబ్లీలో చర్చించి, కేబినెట్ సబ్ కమిటీ వేశామన్నారు. నివేదికల ఆధారంగా కేబినెట్‌లో చర్చించి, అసెంబ్లీలో నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దీనివల్ల ఎలాంటి న్యాయ పరమైన చిక్కులు లేకుండా చేశామని తెలిపారు సీఎం. వర్గీకరణకు తీర్మానం చేయాలని ప్రతిపక్ష ఎమ్మెల్యేగా అసెంబ్లీలో కొట్లాడిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం లేవనెత్తిన సమస్యలు, అభ్యంతరాలను కేబినెట్ సబ్ కమిటీతో పాటు కమిషన్ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు సీఎం. సమావేశం తర్వాత మీడియాతో మాట్లాడారు మందకృష్ణ మాదిగ. ఎస్సీ వర్గకరణ తొలి నుంచి మద్దతు ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రిజర్వేషన్ పర్సెంటేజ్‌ల గురించి ప్రస్తావించామన్నారు. గతంలో కొన్ని కులాలను వేరే గ్రూపులో చేర్చారన్నారు. న్యాయబద్ధమైన డిమాండ్లను పరిశీలించి ముఖ్యమంత్రి తగు నిర్ణయం తీసుకుంటామని ఆశిస్తున్నట్లు చెప్పుకొచ్చారాయన.

# కులగణనలో పాల్గొని వారు బీసీలపై ప్రేమనా..?

కరీంనగర్,ఫిబ్రవరి11: బీసీలపై ప్రేమ కురిపిస్తున్న బీఆర్ఎస్ నేతలు, మాజీ ముఖ్యమంత్రి, మంత్రులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు ముందుగా కులగణనలో పాల్గొనాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా కులగణన దరఖాస్తులను వారికి పంపారు. ఈ సందర్భంగా మంగళవారం కరీంనగర్‌లో మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ముందు మీరు కులగణనలో పాల్గొని.. అప్పుడు మాట్లాడాలన్నారు. బలహీన వర్గాలకు న్యాయం జరగడం ఇష్టం లేదా అని ప్రశ్నించారు. బీజేపీ, బీఆరెస్‌కు బీసీల పట్ల చిత్తశుద్ధి ఉందా.. చేతగకపోతే నోరు మూసుకుని కూర్చోవాలన్నారు. కులగణనపై బీజేపీ కుట్ర చేస్తోందని.. సూచనలు, సలహాలు ఇస్తే తీసుకుంటామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మైనార్టీలను ఇప్పుడు కొత్తగా బీసీల్లో చేర్చలేదని.. మైనార్టీలు ఎప్పటి నుంచో బీసీల్లో ఉన్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు దమ్ముంటే కేంద్రంతో దేశ వ్యాప్తంగా కుల సర్వే చేయాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌ను అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తే.. బీసీ సమాజం బాధపడిందని అన్నారు. ఎమ్మెల్సీ కల్వకుంట కవిత లిక్కర్ నినాదం



అయి పోయిందని, ఇప్పుడు బీసీ నినాదం ఎత్తుకున్నారని అన్నారు. కవితకు అప్పుడప్పుడు జాగృతి గుర్తుకు వస్తుందని, ఏమీ లేకపోతే బతుకమ్మ నినాదం ఎత్తుకుంటారని, ఆమె ఒక ఆడబిడ్డ.. ఆమెను విమర్శించాలని తమకు లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.

# ట్రాన్స్ జెండర్లు బలవంతపు వసూళ్లకు వద్దు ...

బాలానగర్, ఫిబ్రవరి 11 : ట్రాన్స్ జెండర్లు బలవంతపు వాసులకు జీవించకుండా సమాజంలో గౌరవప్రదంగా ఉండాలని బాలనగర్ నరసింహరాజు అన్నారు. మంగళవారం బాలానగర్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ట్రాన్స్ జెండర్లతో అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్ జెండర్లు పెళ్లిళ్లు, పేరంటాలు, కూడళ్ళలో బలవంతపు వసూళ్లకు గౌరవంగా మసలుకోవాలని సూచించారు. ఫాన్స్ జెండర్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి అవకాశాలు పొందేందుకు అనేక అవకాశాలు కల్పిస్తామని ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని సూచించారు. ట్రాన్స్ జెండర్ ల పేరుతో వసూళ్లకు చూస్తూ గౌరవాన్ని కోల్పోకూడదు అని సూచించారు. హైదరాబాద్ సిటీ ట్రాన్స్ జెండర్లకు ట్రాఫిక్ నియంత్రణ వాలంటీర్లుగా నియమించి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఉపాధి అవకాశాల వైపు అడుగులు వేస్తూ గౌరవంగా జీవించాలని సూచించారు. ట్రాన్స్ జెండర్లు కనీస విద్యారత లేకపోవడం వలన భిక్షాటనకు అలవాటు పడాలని సూచించింది. ఓపెన్ స్కూల్లో విద్యాభ్యాసం చేయాలంటే కనీస విద్యార్హత పొందినట్లు అవుతుందని సూచించింది. కనీస



విద్యారత లేని ట్రాన్స్ జెండర్లు కొంతమంది సెక్స్ వర్కర్లుగా అవతారం ఎత్తి దుర్భర జీవితాలు గడుపుతున్నారు. సమాజంలో ట్రాన్స్ జెండర్ల పట్ల ప్రత్యేక గౌరవం లభించాలంటే బలవంతపు వసూళ్లకు ప్రేరేపణ, వ్యభిచారానికి డ్రగ్స్ వంటి పనులను మానుకోవాలని సూచించారు. ట్రాన్స్ జెండర్ లకు పోలీస్ వ్యవస్థ అండగా ఉంటుందని సూచించారు. కానీ ట్రాన్స్ జెండర్లు కూడా బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా. ట్రాన్స్ జెండర్ పనితీరు పట్ల ఎవరైనా ఫిర్యాదు చేసిన ఎడల చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

# ఎన్నికల ఓటమి కారణంగా పోటీ చేయడం లేదు...



హైదరాబాద్,అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓటమితో బీఆర్ఎస్ నేతలం నిరాశ, నిస్పృహలో ఉన్నామని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కీలక కామెంట్స్ చేశారు. ఉన్న మాటే చెబుతున్నానుని.. దీనిలో దాపరికం ఏమీ లేదని చెప్పారు. తెలంగాణ భవన్‌లో వినోద్ కుమార్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం లేదని చెప్పారు. ఓటరు నమోదు కార్యక్రమంలో తాము పాల్గొనలేదన్నారు. అందుకే ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉన్నామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణలో తప్పిదాలున్నాయన్నారు. గతంలో కూడా బీఆర్ఎస్ పోటీ చేయని సందర్భాలు ఉన్నాయని అన్నారు. మోదీ సర్కార్ వెంటనే దేశంలో జనాభా లెక్కింపు జరపాలని డిమాండ్ చేశారు. కులగణన నుంచి తప్పించుకోవటానికే మోదీ.. జనగణన చేయటంలేదని విమర్శించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు నుంచి తప్పించుకోవాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. డీ లిమిటేషన్ జరిగితే తెలంగాణలో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని చెప్పారు. 2026లో అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని విభజన చట్టంలో ఉందని చెప్పుకొచ్చారు. 2021లో జరగాల్సిన జనాభా లెక్కలు కోవిడ్ ప్రభావం వల్ల వాయిదా పడ్డాయన్నారు. గుడ్డి ఎద్దు చేనులో పడినట్లు.. మోదీ పాలన చేస్తున్నారని ఆక్షేపించారు. 2011లో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తుచేశారు. పేదలకు రేషన్ ఇవ్వటం ఇష్టంలేకనే జనాభా లెక్కలకు వెనకడుగు వేస్తున్నారని తెలిపారు. జనాభా లెక్కింపు జరిపితే కొత్తగా 10కోట్ల మందికి కొత్త రేషన్ కార్డులు వస్తాయని పేర్కొన్నారు.

సంపాదకీయం

బుధవారం 12-02-2025

# పరువుకు వైకల్యం


సమాజంలో భాగమే కానీ సాధారణ జీవితం గడపలేరు. అందరితో సమానమే అయినా ఆత్మవిశ్వాసంతో మనలేరు. శారీరక సమస్యల కంటే కూడా మానసిక వైకల్యం వారికి ప్రతిబంధకమౌతుంది. న్యూనతా భావానికి గురిచేస్తుంది. 'కనబడే వికలం కన్న/ మదిలో వైకల్యమున్న/ మహా ప్రమాదకరము/ దీన్ని ఎరిగి మసలుమన్న' అంటారో కవి. ఇదో సంక్లిష్ట వాస్తవ స్థితి. పరిజ్ఞానం, ప్రవర్తన వంటి అంశాలకు సంబంధించి కనిస్తుంది. ఏది నిజమో ఏది కాదో చెప్పలేని పరిస్థితిలో వుంటారు. ప్రతి 8 మందిలో ఒకరు చొప్పున ప్రపంచవ్యాప్తంగా 97 కోట్ల మంది మానసిక రుగ్మతతో బాధపడుతున్నారు. ఈ వైకల్యానికి వారు బాధ్యులు కాకున్నాసామాజిక వివక్ష, మానవహక్కుల ఉల్లంఘనను ఎదుర్కొంటున్నారు. అందరూ వున్నా, అన్ని హక్కులూ వున్నా%ో% ఏమీ వినియోగించుకోలేని వారుగా బతికేస్తున్నారు. వారేం చేస్తున్నారో వారికే తెలియని స్థితి. కొన్నిసార్లు వారికివారే హాని చేసుకోవడమో, ఇతరులకు హాని చేయడమో చేస్తుంటారు.ఏ వైకల్యం లేని మనిషి జీవితం సాఫీగానే సాగిపోతుంది. చిన్న వైకల్యం వున్నా%ో%అది జీవితాంతం వారిని పీడిస్తుంది. కొందరు పుట్టుకతో ఆరోగ్యవంతులుగా పుట్టినప్పటికీ హఠాత్తుగా మానసిక రోగులుగా మారుతుంటారు. మొదట్లో దీన్ని తేలిగ్గా తీసుకోవడంతో సమస్య జటిలంగా మారుతుంది. చాలామందికి మానసిక వైకల్య సమస్యలపై నిశితమైన పరిశీలన లేకపోవడం, ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన వైద్య చికిత్స అందించలేకపోవడం, మానసిక వైకల్యం వున్నవారికి చికిత్స చేసే వైద్యులు అందుబాటులో లేకపోవడం వంటివి కారణమౌతున్నాయి. తమ పిల్లలకు మానసిక వైకల్యమని చెప్పుకోడానికి కూడా భయం. బంధువుల్లో పరువు పోతుందనో, చులకనైపోతామనో దాచిపెట్టే ప్రయత్నం చేస్తుంటారు. ఈ రుగ్మతలున్న వారు తేడాగా ప్రవర్తిస్తుంటారు. లేదా ఇతరుల దృష్టిలో వింత ఆలోచనలు, ప్రవర్తన వున్నవారిగా కనిపిస్తుంటారు. 'ఆన్‌లైన్ గేమ్స్ ఆడొద్దని మందలించిన తల్లిపై కత్తితో దాడి చేయడంతో, ఆమె అక్కడికక్కడే చనిపోతుంది. అతనికి మతి స్థిమితం సరిగాలేదని బంధువులు చెబుతుండగా, అప్పుడప్పుడు బట్టలు వేసుకోకుండానే ఇంట్లో తిరిగేవాడని పనిమనిషి చెబుతుంది.' ఇదొక ఉదాహరణ మాత్రమే. మానసిక వైకల్యం వచ్చిన వారిలో సగానికి పైగా 14 ఏళ్ల లోపు నుంచే ఈ సమస్య ప్రారంభమౌతుంది. మానసిక రుగ్మతలు, మానసిక వైకల్యం వంటివన్నీ ఒకేలా వుండవు. ఈ బలహీనతలు పెరిగి పెద్దదవడానికి కుటుంబ సభ్యులు కూడా కారణమౌతున్నారని కొన్ని అధ్యయనాలు వెల్లడించాయి.మానసిక వైకల్యాన్ని పరువుకు సంబంధించిన అంశంగా చూస్తున్నారే తప్ప ఇదొక అనారోగ్య సమస్య అని, అన్ని రోగాల మాదిరిగానే చికిత్స చేయించాలన్న భావనతో చూడలేకపోతుండం కూడా ఒక సామాజిక రుగ్మత. ఆందోళన, నైరాశ్యం వంటి మానసిక రుగ్మతలు భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ప్రబలుతున్నాయి. వారి విపరీత ప్రవర్తన వల్ల ఎటువంటి అనర్థాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత కుటుంబంతో పాటు సమాజానికి వుంది. అందరిలాగే సమాన గౌరవం, జీవించే హక్కు వారికీ వుంది. మానసిక వైకల్యం కారణంగా ఎవరినీ వివక్షకు గురిచేయకూడదని ఐరాస స్పష్టంగా చెబుతోంది. ముఖ్యంగా మానసిక రుగ్మతలతో బాధపడుతున్న చాలామందికి సమర్థవంతమైన సంరక్షణ, చికిత్స అందుబాటులో లేదు. సరైన సమయంలో సరైన చికిత్స అందించడం ద్వారా వారిని మామూలు మనుషులుగా తీర్చిదిద్దవచ్చు. నోబెల్ బహుమతి గ్రహీత, అమెరికన్ కవయిత్రి లూయిస్ గ్లక్ చిన్నప్పుడు తీవ్రమైన అనారోగ్య సమస్యతో బాధపడేది. తరచూ చావు గురించి ఆలోచించేది. కొన్నేళ్లపాటు మానసిక చికిత్స కూడా తీసుకుంది. తన తల్లి వినిపించిన గ్రీకు పురాణగాథలు, ప్రకృతి ఆరాధన వంటివి లూయిస్‌ను ఎంతగానో ప్రభావితం చేశాయి. మానసిక రుగ్మతల నుంచి, చనిపోవాలన్న కోరిక నుంచి సాహిత్యం వైపు నడిపించాయి. మనిషి తలచుకుంటే ఏదీ అసాధ్యం కాదు. 'అలుముకున్న చీకటిలోనే అలమటించనేల/ కలతలకే లొంగిపోయి కలవరించనేల/ సాహసమను జ్యోతిని చేకూని సాగిపో' అంటారు మహాకవి శ్రీశ్రీ. మానసిక వైకల్యంతో బాధపడుతున్న వారికి సరైన చికిత్స అందించగలిగితే, కుటుంబం వారికి అండగా వుంటే వారు కూడా సమాజంలో గొప్పవారిగా నిలబడతారు.

# టీ - కాంగ్రెస్ అలర్ట్.. అసలు పార్టీలో ఏం జరుగుతోంది..?




హైదరాబాద్, ప్రజాసేవపై నిరంతరం ఆసక్తి చూపడం, తెలివిగా ఆలోచించడం, సహనంతో పని చేయడం.. తప్పుల నుంచి నేర్చుకోవడం, లక్ష్య సాధనకు కొత్త మార్గాలను అన్వేషించడం.. ఇవి అత్యుత్తమమైన రాజకీయ నాయకులకు ఉండాల్సిన లక్షణాలని చాణక్యుడు ఎప్పుడో చెప్పిన మాట. కానీ తెలంగాణ కాంగ్రెస్ లో ఏం జరుగుతోంది? ఏడాది తిరగక ముందే ఎవరికి వారే అన్నట్లుగా మారితే ఎవరికి నష్టం? తెలంగాణ ఇచ్చిన పార్టీగా పదేళ్ల తర్వాత అధికారంలోకి వస్తే దాన్ని పది కాలాల పాటు కాపాడుకునేలా ఆలోచన చేయట్లేదా? సీఎల్పీ మీటింగ్ అవుట్ కమ్ చెబుతున్నదేంటి?ప్రజా జీవితం అనిశ్చితం. అడ్డంకులను అధిగమించడానికి వ్యూహాత్మక ఆలోచన చేయాలి గానీ.. ఒకటే స్టైల్ లో వెళ్తామంటే కుదురుతుందా? కానే కాదు. ఇది ప్రజాక్షేత్రం. ఓట్లేసేవాళ్లే దేవుళ్లు.. వారిని మెప్పించడం ప్రజాప్రతినిధుల బాధ్యత. ఆ లైన్ లో పని చేస్తేనే విజయం వరిస్తుంది. కానీ ఇప్పుడు టీకాంగ్రెస్ తీరు చూస్తుంటే అలర్ట్ అవ్వాల్సిన టైం వచ్చినట్లే కనిపిస్తోంది. అందుకే సీఎల్పీ మీటింగ్ లో అలర్ట్ చేయాల్సింది చేసేశారు. సమస్య వచ్చింది పరిష్కారం కచ్చితంగా ఉంటుంది. అభిప్రాయ బేధాలొచ్చాయి.. కూర్చుని మాట్లాడుకుంటే తీరుతాయ్. అంతే గానీ అదే పనిగా అలకలు, అసంతృప్తులు, సొంత పార్టీ చేస్తున్న పనులను విమర్శిస్తూ కూర్చుంటే కచ్చితంగా మైనస్ అవుతుంది. అందుకే సీఎల్పీ మీటింగ్ లో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీ వార్నింగ్ ఇచ్చేదాకా పరిస్థితి వెళ్లింది.తెలంగాణ ఇచ్చిన పార్టీగా పదేళ్ల తర్వాత రాకరాక అధికారం వచ్చింది. మరి దాన్ని నిలుపుకోవాలంటే ఏం చేయాలి.. మార్పు కావాలి కాంగ్రెస్ రావాలన్నారు. మరి కాంగ్రెస్ వచ్చింది.. కానీ పార్టీలో ఏం జరుగుతోంది? ఏడాదికే జనంలో పలచన అయిపోయేంతగా లుకలుకలు బయటపడాలా? బలహీనంగా ఉన్నా.. బలంగా ఉన్నామనే చెప్పుకోవాలి.. లోపాలుంటే అంతర్గతంగా సరిదిద్దుకోవాలి.. కానీ బహిరంగ విమర్శలు దేనికి? అందరికీ నచ్చే.. అందరూ మెచ్చే నిర్ణయాలే కదా ఇప్పుడు జరుగుతున్నాయి. అంతిమంగా ప్రజలకు మేలు జరిగేవే చేస్తున్నారు కదా.. ఒక్క లైన్ పై ఉండాల్సిన పరిస్థితుల్లో లైన్ దాటితే ఏమవుతుంది అనుకోవచ్చు. కానీ జరిగేది జరుగుతుంది. అందుకే అందరినీ ఒక్కతాటిపైకి తెచ్చేందుకు నిర్వహించిన సీఎల్పీ సమావేశం చాలా ప్రశ్నలకు సమాధానమిచ్చింది. ప్రజాప్రతినిధుల మధ్య సఖ్యత పెరిగేలా వాతావరణం కల్పించింది.రాజకీయ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఎవరైనా సలహాలు, సూచనలు ఇస్తే తప్పకుండా తీసుకోవాలి. ఎదుటివారు చెప్పేది సీఎం సావధానంగా వింటున్నారు. అందరికీ అందుబాటులో ఉన్నారు. ఎవరు వచ్చినా కాదనకుండా కలుస్తున్నారు. గతంలో ఇలాంటి పరిస్థితి లేదు కదా. తమ నియోజకవర్గానికి ఇది కావాలి అని వెళ్తే కాదనకుండా చేస్తున్న పరిస్థితి చూడడం లేదా? ప్రస్తుతం కాంగ్రెస్ లో సిచ్యువేషన్ ఎలా ఉందంటే చాలా మంది రిలాక్స్ మోడ్ లో కనిపిస్తున్నారు. అందుకే లేటెస్ట్ గా పెట్టిన సీఎల్పీ మీటింగ్ ఒక అలర్ట్ అయితే ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 21 వేల కోట్ల రుణమాఫీ చేసినా.. 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చినా దాన్ని అందిపుచ్చుకోవడం లేదన్న చర్చ అయితే నడుస్తోంది. పైరవీలు, పరేషాన్లు ఎందుకన్న టాక్ కూడా నడుస్తోంది.జనంలో ఉండకుండా.. చేసింది గొప్పగా ప్రచారం చేసుకోకుండా తిప్పలెందుకన్న టాక్ కూడా వచ్చింది. పార్టీ లీడర్ షిప్ లైన్ లో పని చేయాల్సిన బాధ్యత లేదా? పార్టీ ఫస్ట్ పర్సన్ సెకండ్ అని పీసీసీ చీఫ్ ఎందుకు అనాల్సి వస్తోందన్నది హస్తం పార్టీలో ఇప్పుడు అందరూ ఆలోచించుకోవాల్సిన టైమ్. నాకేమిస్తారు.. నాకేం కావాలి.. బదులు పార్టీకి ఏం కావాలి.. జనంలో ఇంకా బలం పెంచుకోవడం ఎలా అన్న యాంగిల్ లో ఆలోచిస్తే పదవులు వాటంతట అవే వస్తాయన్న చిన్న లాజిక్ మిస్ అయితే ఎలా? అందుకే ఇంట్రాస్పెక్షన్ చేసుకోవాల్సిన టైం వచ్చేసిందన్నది ఇప్పుడు వస్తున్న మాట. సమస్య ఉంది.. పరిష్కారం కావాలి.. అంత మాత్రానికే సీక్రెట్ మీటింగ్స్ డిన్నర్ మీటింగ్స్ ఎందుకన్నది పార్టీ మాట.తెలివితో పాటు నిజాయితీ, నమ్మకం కూడా ముఖ్యమే.. లోపల ఒకలా.. బయట ఒకలా ఉంటే కుదురుతుందా? తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీ వైపు ఎడ్జ్ పెరిగినా.. రేవంత్ రెడ్డి దూకుడుతో అంతా కాంగ్రెస్ వైపు టర్న్ అయింది. అప్పుడున్న టీమ్ వర్క్ అధికారంలో ఉన్నప్పుడు కూడా కంటిన్యూ అయితే ఇంకా బలం పుంజుకుంటారని తెలియదా..? ఇది పోటీ యుగం. కళ్లు మూసి తెరిచేలోపు చాలా జరిగిపోతుంటాయి. సహజంగానే అధికారంలో ఉన్న వారిపై అన్ని వైపుల నుంచి ఫోకస్ ఉంటుంది. విమర్శలు వచ్చి పడుతూనే ఉంటాయి. వాటిని ఎదుర్కోకుండా.. విమర్శలు పెరిగేలా వాతావరణం సృష్టిస్తే నష్టం జరిగేదెవరికన్నది చర్చకు పెట్టిన మ్యాటర్.ఉత్త గీతలే మన చేతిలో ఉంటాయ్.. రాతలు మన చేతిలో ఉండవ్ అంటారు. కానీ చేసే మంచి పనులతో రాతలు కూడా మారుతాయ్. ఇదే ఫార్ములాను కాంగ్రెస్ అందిపుచ్చుకోవాల్సిన టైం వచ్చేసింది. నిజానికి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో చాలా పనులు జరిగాయ్. ఎంత చేసినా ప్రతిపక్షాలు అంటూనే ఉంటాయి. మరి వారికి కౌంటర్ ఇవ్వకుండా, అవకాశం ఇచ్చేలా చేయడం కరెక్టేనా అన్న వాదన చుట్టూ మ్యాటర్ తిరుగుతోంది.తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తూనే ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ఫోకస్ పెట్టింది. మహిళలకు ఫ్రీ బస్సు వచ్చింది. 200 యూనిట్ల దాకా ఫ్రీ కరెంట్ వస్తోంది. 500 రూపాయలకే సిలిండర్లు ఇస్తున్నారు. తాలు తప్ప తేమ ఇలా కొర్రీలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేసి రైతుల అకౌంట్లలో వేశారు. గత పదేళ్లతో పోలిస్తే వచ్చిన మార్పు ఇది కాదా.. రోజుల తరబడి కల్లాల్లో ధాన్యం అమ్మేందుకు ఎదురు చూసిన ఇదే రైతులు త్వరత్వరగా ఇప్పుడు అమ్మేయలేదా.. అంతెందుకు సన్నాలు పండించిన వాళ్లకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వం కాదా?25 లక్షల రైతు కుటుంబాలకు 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ జరిగింది వాస్తవం కాదా? అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే 31 వేల మందికి ఉద్యోగ నియామకపత్రాలు ఇవ్వడం, ఏడాది తిరగక ముందే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదే. ఇవే కాదు.. గత పదేళ్లు తొక్కిపెట్టిన రేషన్ కార్డులకు మోక్షం కల్పించింది కాంగ్రెస్ ప్రభుత్వమే కదా. రైతు భరోసా ఎకరానికి 6 వేలు వరుసగా అందుతున్నాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం షురువైంది. ఆరోగ్యశ్రీ పరిధి 10 లక్షలకు పెరిగింది. ఇంత జరుగుతున్నా.. ఇంత చేసినా చెప్పుకోవడంలో వెనుకబడుతున్నది ఎవరు? ఈ పథకాలన్నీ అర్హులకు ఇప్పించుకోవడం ఎమ్మెల్యేల బాధ్యత కాదా? అక్రమార్కులు చెరబట్టిన చెరువులకు హైడ్రాతో విముక్తి కల్పిస్తున్నారు. జనంతో పాటు పర్యావరణం కూడా ముఖ్యమే కదా. మంచిని జనం ఆహ్వానిస్తారు. దాన్నే చెప్పుకోవడం ముఖ్యం.ఎప్పటి నుంచో పెండింగ్ లో ఉన్న ఎస్సీ వర్గీకరణపై తీర్మానం చేసి పంపడం, అలాగే కులగణన చేసి బీసీలకు మేలు చేయాలన్న ఆలోచనతో దాన్ని పట్టాలెక్కించడాన్ని ఆహ్వానించాల్సిన బాధ్యత కాంగ్రెస్ సభ్యులదే. మరి జనానికి వాటిని వివరించడం కష్టమవుతోందా.. ఓవైపు లక్ష మంది ఎన్యుమరేటర్లను పెట్టి.. వారిలో ఒక్కొక్కరికి 150 ఇండ్లు ఇచ్చి 60 రోజుల్లో పకడ్బందీగా సర్వే చేయిస్తే దాన్ని రాంగ్ డైవర్షన్ లో తీసుకెళ్లడం కరెక్టేనా? అసలు ఇన్నాళ్లు బీసీలకు మేలు జరగాలన్న ఆలోచనే జరగలేదు. కనీసం ఇప్పుడైనా ఓ ముందడుగు పడిందని గుర్తించలేకపోతున్నారెందుకు? అది కూడా లేకపోతే ఏదీ రాదు అన్నది గ్రహించలేకపోతున్నారా.. విపక్షాల లైన్ లో కాంగ్రెస్ చేసిన గొప్పపనిని తక్కువ చేసి చూపించుకుంటే నష్టపోయేది ఎవరు? ఆలోచించుకోవాలి.మరో ముఖ్యమైన సమస్య. మంత్రులు, ఎమ్మెల్యేలకు గ్యాప్ ఎందుకు వస్తోంది.. ఎమ్మెల్యేలు కార్యకర్తలకు మధ్య గ్యాప్ ఇలాగే ఉంటే కష్టం కాదా.. అన్నది ఇంకో పాయింట్. ఇదే విషయంపై మున్షి ఘాటుగా వార్నింగ్ ఇచ్చారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. విపక్షంలో ఉన్నప్పుడే కార్యకర్తలను గుర్తు పెట్టుకోవడం కాదు.. అధికారంలో ఉన్నప్పుడు కూడా వారి సాదకబాధకాలు వినాలన్న పాయింట్ తెరపైకి వస్తోంది. ఇవన్నీ వదిలేసి పైరవీలు, పదవులు అంటూ తిరిగితే ఐదేళ్ల తర్వాత ఏం జరుగుతుందో గ్రహించలేరా? అన్నది సమీక్షించుకోవాల్సిన టైమ్ వచ్చేసింది.గ్రామీణ రోడ్లన్నీ బాగు చేస్తున్నారు. ఆపకుండా నిధులు ఇస్తున్నారు. ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధులు దగ్గరుండి నియోజకవర్గం బాగోగులు చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేస్తోంది నాయకత్వం. గతంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే ప్రయారిటీ ఇచ్చి మిగితా ప్రాజెక్టులను అడ్డంగా బుక్ చేశారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ వచ్చాక అన్ని ప్రాంతాలకూ బెనిఫిట్ జరగాలన్న ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చిన్న నీటి పారుదల ప్రాజెక్టులకు ప్రయారిటీ ఇస్తున్నారు. ఇవన్నీ చెప్పుకోకపోతే ఎలా.. దగ్గరుండి చూసుకోకపోతే ఎలా.. అన్నది చర్చకు వస్తోంది.అడుగడుగునా నెగెటివిటీకి బ్రాండ్ అంబాసిండర్ లా ఉంటామంటే ఈ కాలం రాజకీయాల్లో కుదురుతుందా.. చుట్టూ పాజిటివ్ వైబ్రేషన్స్ ఉండేలా చూసుకుంటే విజయం మనదే అన్న కర్తవ్యబోధ చేసిన సందర్భం. ధైర్యంతో అడుగు ముందుకేస్తే ప్రత్యర్థులు సైతం భయపడిపోతారన్నది చాణక్య నీతి. మరి ధైర్యంగా ముందడుగు వేయకుండా ప్రత్యర్థుల్లో పలచన అవుతారా? ఏంటన్నది తేల్చుకోవాల్సిన టైమ్ వచ్చింది. అందుకే సీఎల్పీ మీటింగ్ మొదటి ప్రమాద హెచ్చరిక మాదిరిగా పార్టీలో ముఖ్యంగా కాంగ్రెస్ ప్రజాప్రతినిధులను అందరినీ అలర్ట్ చేసింది.ఆర్థికంగా, రాజకీయంగా ఇంకా అన్ని విధాలుగా మేం బలవంతులం అనుకునే వారికి కూడా ఎదురుదెబ్బలు తగులుతుంటాయి. ఎందుకంటే ఇది ప్రజాక్షేత్రం. ప్రజలే అంతిమ న్యాయనిర్ణేతలు. ఎంత పలుకుబడి ఉపయోగించినా అన్ని రోజులు అనుకూలంగా ఉండవు. తెరవెనుక ఏం చేయడమో కాదు.. నిజాయితీ, విధేయత ఉండడం ముఖ్యం. ఇది సీఎల్పీలో సీఎం క్లియర్ కట్ గా చెప్పారు.ప్రశ్నలుంటాయి సమాధానాలు కూడా వస్తాయి.. సమస్యలు కామన్.. వాటికి పరిష్కారాలూ ఉంటాయి, పార్టీ అన్నాక అభిప్రాయ బేధాలు, అంతర్గత విబేధాలు, అలకలు, అసంతృప్తులు ఉంటాయి. వాటికి ముగింపు పలకాలి. ఏడాది కాలంగా చేసిన పనులను చెప్పుకోవాలి, ముందున్న సవాళ్లను సమిష్టిగా ఎదుర్కోవాలి. అలా అందరికీ బాధ్యత గుర్తు తెచ్చిన సందర్భమిది. పదవులు కావాలంటే పార్టీ లైన్ లో, జనం లైన్ లో పని చేయాలి. వాటంతట అవే వస్తాయి ఢోకా లేదు. కానీ పదవులు, పైరవీల కోసమే ఏదైనా చేస్తామంటే కుదరని పని అన్నది ఇప్పుడు ఇచ్చిన మెసేజ్.తెలంగాణ ఉద్యమాన్ని గుర్తించి రాజకీయంగా ఎంతో త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని ఇస్తే పదేళ్లకు కాంగ్రెస్ కు అధికారం వచ్చింది. మరి దీన్ని ఐదేళ్లకే ముగింపు పలకడమా.. లేదంటే పది కాలాల పాటు ఉండడమా అన్నది హస్తం పార్టీ నేతల చేతుల్లోనే ఉంది. ప్రత్యర్థి పార్టీలు తాత్కాలికంగా బలహీన పడ్డా.. బలం పుంజుకునే శక్తియుక్తులు వారికి ఉన్నాయన్నది గుర్తుంచుకోవాల్సిన విషయం. జనం కూడా చైతన్యవంతులే. ఏది రైటు, ఏది రాంగో తెలుసుకుంటారు. రైట్ అనిపించుకునేలాగే మిగితా నాలుగేళ్లు కాంగ్రెస్ నేతలు టీమ్ వర్క్ గా పని చేస్తే విక్టరీ సాధ్యం.

# పోలీసులతో బేరసారాలకు దిగిన మస్తాన్ అలీ



హైదరాబాద్, నగ్న వీడియోల కేసులో లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మస్తాన్ సాయిని అరెస్ట్ చేసిన పోలీసులు జ్యూడిషియల్ రిమాండ్‌కు తరలించారు. అలాగే మస్తాన్ సాయి ఎఫ్ఐఆర్‌లో కూడా కీలక విషయాలు వెల్లడించారు పోలీసులు. నగ్న వీడియోలే కాకుండా డ్రగ్స్ పార్టీలు కూడా చేసుకున్నట్లు బయటపడింది. వారాంతరాల్లో మస్తాన్ సాయి ఇంట్లో జరిగే డ్రగ్స్ పార్టీలకు యువతీయువకులు పాల్గొన్న వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో డ్రగ్స్ బయటపడటంతో నార్కోటిక్ పోలీసులు కూడా రంగంలోకి దిగారు. ఇక తాజాగా మస్తాన్ సాయి లావణ్య కేసులో మరో ఆడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. మస్తాన్ సాయి, అతడి తండ్రి మాట్లాడిన ఆడియో బయట పడింది. వీరు ఏకంగా పోలీసులతోనే బేరసారాలు ఆడినట్లు ఆడియోలు స్పష్టంగా వినిపిస్తోంది. మస్తాన్ సాయిపై లావణ్య పెట్టిన కేసులో పోలీసులతో బేరసారాలకు దిగారు వీరు. గతంలో ఏపీలోని గుంటూరు జిల్లా పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో మస్తాన్ సాయిపై లావణ్య కేసు పెట్టింది. ఈ క్రమంలో ఈ కేసును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు పోలీసులతో బేరసారాలు ఆడినట్లు తెలుస్తోంది. ఛార్జ్‌షీట్ వేసే సమయంలో తమకు అనుకూలంగా రాస్తే డబ్బులు ఇస్తామని మస్తాన్ సాయి, అతడి తండ్రి పోలీసులకు తెలిపారు. పోలీసులకు డబ్బులు ఎరవేసి మరీ తనకు అనుకూలంగా కేసును మార్చుకున్నాడు మస్తాన్ సాయి. లావణ్య ఇచ్చిన ఫిర్యాదు ఉన్నది ఉన్నట్లుగా కాకుండా మనకు అనుకూలంగా ఛార్జ్‌షీట్ ఉండాలని తండ్రితో మస్తాన్ సాయి మాట్లాడిన ఆడియో ఇప్పుడు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారింది. గతంలో మస్తాన్ సాయి సోదరి వద్దకు లావణ్య వెళ్లింది. ఈ క్రమంలో ఆమె వీడియోలు తీశాడు మస్తాన్ సాయి. దీనిపై ప్రశ్నించగా లావణ్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు..

# డంకీరూట్‌లో అక్రమంగా ప్రవేశం

న్యూఢిల్లీ,డంకీ రూట్..అంటే దొంగమార్గమని వేరుగా చెప్పనక్కరలేదు. అగ్రరాజ్యంలో ఈ రూట్లో ప్రవేశించేందుకు యత్నించిన అనేకమంది అసువులు బాసారు. ఇందులో అనేకదేశాల వారూ ఉన్నారు. భారతీయులు కూడా ఇలా ప్రత్యించి ప్రాణాలు పోగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్రమంగా తమ దేశానికి వచ్చిన 104 మంది భారతీయులను ఇటీవల అమెరికా తిప్పి పంపిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దీంతో అగ్రరాజ్యంలోకి అక్రమంగా వెళ్లగలిగే మార్గాలపై చర్చ మొదలైంది. ఈనేపథ్యంలోనే తాజాగా ఓ పంజాబీ యువకుడు డంకీ రూట్ లో అమెరికా వెళ్తూ మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. 33 ఏళ్ల గుర్‌ప్రీత్‌సింగ్ గ్వాటెమాలాలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. 'నా సోదరుడు గుర్‌ప్రీత్ అమెరికా వెళ్లేందుకు మూడు నెలల కిందట ఇంటి నుంచి బయల్దేరాడు. ఇందుకోసం చండీగఢ్‌లోని ఏజెంట్ బల్విందర్‌సింగ్‌ను సంప్రదించాడు. అతడు రూ.16.5 లక్షలు తీసుకొని నా సోదరుడిని గయానా పంపించాడు. అక్కడ ఓ పాకిస్థానీ ఏజెంట్‌కు అప్పగించాడు. అనంతరం మరికొందరు వలసదారులతో కలిసి పనామా అడవి గుండా కొలంబియాకు బయల్దేరాడు. మధ్యలో ఓసారి మాకు ఫోన్ చేసి గ్వాటెమాలాలోని హోటల్‌లో ఉన్నట్లు చెప్పాడు. ఆ తర్వాత ఇటీవల ఓ వ్యక్తి మాకు ఫోన్ చేసి గుర్‌ప్రీత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పాడు. కారులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు. ఆ తర్వాత ఐదారు నిమిషాలకే నా సోదరుడు చనిపోయినట్లు సమాచారమిచ్చారు' అని గుర్‌ప్రీత్ సోదరుడు తారాసింగ్ మీడియాకు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. తన సోదరుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సాయం చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుడి కుటుంబాన్ని పంజాబ్ రాష్ట్ర మంత్రి కుల్దీప్‌సింగ్ దలివాల్ పరామర్శించారు. 'గుర్‌ప్రీత్ మరణం విచారకరం. ఎవరైనా సరే ఏ దేశానికైనా అక్రమమార్గంలో వెళ్లొద్దు. చట్టపరంగా అన్ని అనుమతులు తీసుకొని వెళ్లండి. డంకీ రూట్‌లో వెళ్లడం సరికాదని మంత్రి సూచించారు.

# సమరానికి సిద్ధమా?

అమరావతి, గద్దె దిగిపోయినా అధికారంపై ధీమా వ్యక్తం చేస్తున్న జగన్ తన క్రెడిబిలిటీ గురించి తెగ ఊదరగొడుతున్నారు. విశ్వసనీయత, విలువలపై మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా అన్నారో? లేకపోతే పొరపాటున నోరు జారారో కాని విజయసాయిరెడ్డిని టార్గెట్ చేయాలని చూశారు. దానికి సాయిరెడ్డి వెంటనే కౌంటర్ ఇచ్చారు. ఆ వెంటనే షర్మిల మీడియా ముందుకొచ్చి జగన్ తన స్వార్థం కోసం సాయిరెడ్డిని ఎంతో టార్చర్ పెట్టాలని ఆరోపించి తీవ్ర కలకలం రేపారు. తన లోటుపాట్లు, అంతర్గత వ్యవహారాలన్నీ తెలిసిన విజయసాయిని జగన్ టచ్ చేయడం ఆయనకే బూమరాంగ్ అవుతుందా? ఇంతకాలం జగన్ చెప్పిందే వేదం అన్నట్లు నడుచుకున్న విజయసాయి ఇక జగన్‌తో అమీతుమీ తేల్చుకోవడానికి సిద్ధమయ్యారా?లండన్ ట్రిప్ నుంచి రాగానే ఎన్నికల్లో విజయంపై బోల్డు ధీమా వ్యక్తం చేస్తున్నారు మాజీ ముఖ్యమంత్రి జగన్.. వచ్చే ఎన్నికల్లో గెలిచి ఏకంగా 30 ఏళ్ళ అధికారంలో కొనసాగుతానని తన జోస్యం తానే చెప్పేసుకుంటున్నారు. పవర్ పోయి 8 నెలలు కాకముందే మళ్లీ గెలుస్తాం.. 30 ఏళ్ళ నేనే ముఖ్యమంత్రిగా ఉంటానని పాత పాట అందుకున్నారు. వైసీపీ రాష్ట్రాన్ని ఏలుతుందని ధీమా వ్యక్తం చేస్తున్నారు. అక్కడితో ఆగితే బాగుండేదేమో.. కాని ఆ సెల్ఫ్ జాతకం చెప్పుకుంటున్న క్రమంలో ఆయన పార్టీని వీడిన కీలక నేతలు, రాజీనామా చేసిన మాజీ రాజ్యసభ సభ్యుల విశ్వసనీయత గురించి మాట్లాడారు.జగన్ ఆ ప్రెస్‌మీట్లో ముందు తాను చెప్పాలనుకుంది చెప్పేశారు. తర్వాత ఎవరో రిపోర్టర్ అడిగిన ప్రశ్నకు రియాక్ట్ అయిన ఆయన క్రెడిబిలిటీ గురించి లెక్చర్ ఇచ్చారు. అది ఆయన ఉద్దేశపూర్వకంగా మాట్లాడారో? లేకపోతే ఆ ఫ్లోలో అనాలోచితంగా నోరు జారారో కాని అది ఇప్పుడు ఆయనకు బూమరాంగ్ అవుతుంది. జగన్ వ్యాఖ్యలపై అక్రమ ఆస్తుల కేసుల్లో జగన్ సహ నిందితులు, మాజీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణలు వెంటనే రియాక్ట్ అయి కౌంటర్ ఇవ్వడంతో.. జగన్ క్రెడిబిలిటీ గురించి మాట్లాడి సెల్ఫ్‌గోల్ చేసుకున్నట్లయిందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.ముఖ్యంగా విజయసాయిరెడ్డి వైసీపీ స్థాపన దగ్గర నుంచి జగన్ వెన్నంటే ఉన్నారు.. అంతకు ముందు జగన్ తండ్రి, తాతల హయాం నుంచి ఆడిటర్ అయిన సాయిరెడ్డికి ఆ కుటుంబంతో అనుబంధం ఉంది. జగన్ లోటుపాట్లు, ఆర్థిక మూలాలు, లావాదేవీల లెక్కలు ఒక ఆడిటర్‌గా సాయిరెడ్డి వేళ్ల మీద ఉంటాయి. వైఎస్ ఫ్యామిలీతో ఉన్న అనుబంధంతో ఆయన మొదటి నుంచి జగన్‌కు వీరవిధేయుడిగానే వ్యవహరిస్తూ వచ్చారు. అక్రమాస్తుల కేసులో జగన్‌తో కలిసి 16 నెలలు రిమాండ్ ఖైదీగా గడిపారు . పార్టీ పదవికి, రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేసినప్పుడు కూడా సాయి రెడ్డి ఆయన్ని పల్లెత్తు మాట అనలేదు.రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించి, రాజ్యసభ పదవికి రాజీనామా చేసిన సాయిరెడ్డి లోటస్‌పాండ్‌లోని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఇంటికి వెళ్లడం, దాదాపు 3 గంటల పాటు భేటీ అవ్వడం రాజకీయవర్గాల్లో సంచలనం సృష్టించింది. జగన్, షర్మిలల మధ్య కుటుంబ, రాజకీయ విభేదాలు తీవ్రస్థాయిలో ఉన్న నేపథ్యంలో విజయసాయిరెడ్డి స్వయంగా వెళ్లి షర్మిలను కలవడం రకరకాల చర్చలకు తావిచ్చింది. విజయసాయిరెడ్డిపై అనేక సందర్భాల్లో షర్మిల ఘాటైన విమర్శలు చేశారు. వివేకానందరెడ్డి గుండెపోటుతో మృతి చెందారని విజయసాయి ప్రకటించడంపైనా ఆమె అభ్యంతరం తెలిపారు.అలాంటి షర్మిలతో భేటీ సందర్భంగా విజయసాయి ఏం మాట్లాడి ఉంటారా అన్న ఉత్కంఠ కొనసాగుతున్న సమయంలో షర్మిలే ఆ సస్పెన్స్‌కు తెర దించారు.. విశ్వసనీయత గురించి మాట్లాడిన జగన్‌కు సాయిరెడ్డి కౌంటర్ ఇచ్చిన తర్వాత షర్మిల మీడియా ముందుకొచ్చి ఆయనతో భేటీ సందర్భంగా చర్చకు వచ్చిన అంశాలను ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల వెల్లడించారు. ఈ సందర్భంగా జగన్‌పై ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. జగన్‌కు అత్యంత సన్నిహితుడిగా ఫోకస్ అయిన విజయసాయి.. వాస్తవానికి జగన్‌తో ఎన్నో ఇబ్బందులు పడ్డారంట.క్యారెక్టర్ అంటే ఏంటో జగన్ మరిచిపోయారని.. అలాంటి జగన్ క్యారెక్టర్ గురించి పెద్ద పెద్ద డైలాగులు చెబుతున్నారని షర్మిల యద్దేవా చేశారు.. వైఎస్ కోరికకు భిన్నంగా అబద్ధం చెప్పాలని విజయసాయిపై ఒత్తిడి తెచ్చినప్పుడు జగన్ క్యారెక్టర్ అర్థమైందని చెప్పిందంట. సొంత మేనకోడలు, మేనల్లుడు ఆస్తులు కాజేయాలని జగన్ ఎన్నో కుట్రలు చేస్తున్నారని%ో% తన పిల్లలకు ముఖం చూపించే ధైర్యం జగన్‌కి ఉందా అని ప్రశ్నించారు.అధికారంలో ఉన్నంత కాలం జగన్ అపాయింట్‌మెంట్ దొరకడమే గగనంగా ఉండేది. మంత్రులు, ఎమ్మెల్యేలనే తన ప్యాలెస్ బయట నిలబెట్టేసిన ఆయన.. పరదాల మాటున పనిపాలన సాగించి.. కార్యకర్తలను ఎప్పుడూ పట్టించుకోలేదు. అలా రాచరిక పాలన సాగించిన జగన్ ఓటమి తర్వాత ఇంత కాలానికి వాస్తవ లోకంలోకి వస్తున్నారు. పార్టీ నుంచి పెరిగిపోతున్న వలసలతో బెంబేలెత్తిపోతూ..

# పవన్ కల్యాణ్ పనితీరుతో అధికారుల్లో ఆశ్చర్యం

అమరావతి,జగన్ 2.0పై మాట్లాడటం ఒట్టి దండగ అని జనసేన నేత సామినేని ఉదయభాను మాట్లాడారు. జగన్ 2.0 వ్యాఖ్యలపై తాము స్పందించాల్సిన అవసరం లేదని అన్నారు. ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఈనెల16న జిల్లాస్థాయి కార్యకర్తల సమావేశం జరుగుతుందని తెలిపారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జనసేన విస్తృత స్థాయి సమావేశానికి అన్ని ప్రాంతాల నుంచి కార్యకర్తలు వస్తారని చెప్పుకొచ్చారు. ఈ సమావేశానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం జనసేన నేతలు సామినేని ఉదయభాను, అమ్మిశెట్టి వాసు, మండలి రాజేష్, అక్కల గాంధీ ఆవిష్కరించారు. ఎన్టీఆర్ జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి ఈనెల 16వ తేదీన సమావేశంలో పాల్గొంటారన్నారు. నాగబాబు, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌లు ఈ సమావేశానికి అతిథులుగా హాజరవుతారని తెలిపారు. ప్లీనరీ సమావేశంలో తీసుకునే నిర్ణయాలను తరువాత తాము ఆచరిస్తామన్నారు. ఈ సందర్భంగా సామినేని ఉదయభాను మీడియాతో మాట్లాడారు. పంచాయతీ రాజ్ శాఖ పని తీరు ద్వారా దేశంలోనే ఏపీకి గుర్తింపు తెచ్చిన ఘనత పవన్ కళ్యాణ్‌దని తెలిపారు. చంద్రబాబు సహకారంతో గతంలో ఎవరూ చేయని విధంగా పనులు చేసి చూపారని అన్నారు. సర్పంచ్‌లకు నిధులు ఇచ్చి వారికి ఒక గౌరవం తెచ్చారన్నారు. గత జగన్ ప్రభుత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను పట్టించుకోలేదని చెప్పారు. ప్రతి గ్రామంలో రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టి వారం వారం నిధులు కేటాయిస్తున్నారని అన్నారు. నేడు సర్పంచ్‌లు అందరూ పవన్ పని తీరుకు అభినందనలు చెబుతున్నారని తెలిపారు. పవన్ కళ్యాణ్ సారథ్యంలో జనసేనను ప్రజలకు మరింత చేరువ చేస్తామని అన్నారు. చాలామంది వైసీపీ నాయకులు జనసేనలోకి చేరేందుకు వస్తున్నారని తెలిపారు. తనకు ఉన్న అనుభవం, పరిచయాల ద్వారా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. తన మీద పవన్ కళ్యాణ్ పెట్టిన నమ్మకం నిలబెట్టేలా పని చేస్తానని చెప్పారు. కూటమి పార్టీల నేతల మధ్య ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఇద్దరు కలిసి రాష్ట్రం కోసం పని చేస్తున్నారన్నారు. కార్యకర్తల మధ్య అక్కడక్కడ అభిప్రాయ భేదాలు ఉంటే సరి చేస్తామని తెలిపారు. వైసీపీ నుంచి చాలామంది జనసేనలోకి వస్తాం అంటున్నారని చెప్పారు. ఆయా నియోజకవర్గాల నాయకులతో మాట్లాడి చేరికపై నిర్ణయం తీసుకుంటామన్నారు. పవన్ కళ్యాణ్ చాలా కీలకమైన శాఖలకు మంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కూడా నిధులు, అనుమతులు రావాల్సిన అంశాలు ఉంటాయన్నారు. అటువంటి కారణాల వల్ల కీలక ఫైల్స్ కొంత ఆలస్యం కావడం సహజమని చెప్పుకొచ్చారు. పవన్ పని తీరును చూసి అధికారులే ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఆనాడు ప్రజారాజ్యం కోసం పని చేసిన వారు చాలామంది జనసేనలోకి వచ్చారని గుర్తుచేశారు. చిరంజీవి ఒక వేదికలో మాట్లాడిన మాటలను వక్రీకరణ చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు ఒకే ఆలోచనతో ప్రజలకు మంచి చేయాలని ముందుకు సాగుతున్నారన్నారు. కిరణ్ రాయల్ వ్యవహారంపై తమ పార్టీ పరంగా విచారణ జరుగుతుందన్నారు. ఆయనపై వచ్చిన అభియోగాలపై విచారణలో వాస్తవాలు తెలుస్తాయని చెప్పారు. తనకు తెలిసి కిరణ్ రాయల్‌పై కుట్రతోనే ఈ అభియోగాలు మోపారన్నారు. త్వరలోనే అన్ని విషయాలు ప్రజలకు తెలుస్తాయని సామినేని ఉదయభాను పేర్కొన్నారు.

# కల్తీ నెయ్యిపై దూకుడు పెంచిన సీట్‌బృందం

అమరావతి,తిరుమల లడ్డు తయారీకి కల్తీ నెయ్యి సరఫరా కేసులో సిట్ బృందం దూకుడు పెంచింది. మరికొందరు కీలక వ్యక్తుల ప్రమేయంపై సీబీఐ ఆధ్వర్యంలోని సీట్ టీమ్ ఆరా తీస్తోంది. గత రాత్రి అరెస్ట్ చేసిన నలుగురు నిందితులను తమ కస్టడీకి ఇవ్వాలని తిరుపతి కోర్ట్‌లో సిట్ టీం పిటిషన్లు దాఖలు చేసింది. బోలె బాబా డెయిరీ డైరెక్టర్లు విపిన్ జైన్, పోమిల్ జైన్, వైష్ణవి డెయిరీ సీఈఓ అపూర్వ విజయకాంత్ చావ్లా, ఏఆర్ డెయిరీ ఎండీరాజు రాజశేఖరన్‌లను సిట్ అరెస్ట్ చేసింది. ఈ నలుగురిని 10 రోజుల పాటు తమ కస్టడీకి ఇవ్వాలని సీబీఐ ఆధ్వర్యంలోని సీట్ టీమ్ కోరింది. తదనంతర దర్యాప్తులో ఎటువంటి ప్రణాళికతో ముందుకు వెళ్ళాలి అనే అంశంపై సీట్ బృందం సమావేశమైంది. దర్యాప్తులో కీలక ఆధారాలు లభించడంతో త్వరలో మరిన్ని అరెస్ట్‌లు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. సీబీఐ బాస్ అనుమతి తీసుకున్న వెంటనే రేపో మాపో మరికొంతమంది కీలక వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకోనున్నారు. ఏఆర్ డెయిరీకి కాంట్రాక్ట్ ఇప్పించడం వెనుక ఉన్న వ్యక్తులు సమాచారాన్ని సిట్ బృందం తెలుసుకుంది. టీటీడీ గత పాలకవర్గంలోని కీలక వ్యక్తులు ఒకరిద్దరు ఏఆర్ డెయిరీ పేరు సిఫార్సు చేశారని సీట్‌కు కీలక సమాచారం అందింది.

# అధ్యక్షుడు ఎవరు?

హైదరాబాద్, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడి ఎన్నిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది. దీంతో అధ్యక్షుడి ఎన్నిక ఎప్పుడు ఉంటుంది అనేదానిపై బీజేపీ శ్రేణులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయి. అధ్యక్ష రేసులో పలువురు కీలక నేతలు ఉన్నారు. ఈ కీలక నేతలు ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకుంటున్నట్లు సమాచారం.

ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదులు..

అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో నేతలు వ్యవహరించిన తీరుపై ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారట. ఇద్దరు ముగ్గురు అగ్రనేతల తీరు అధిష్టానానికి తలనొప్పిగా మారిందని చెప్పుకుంటున్నారు. అధ్యక్ష రేసులో ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు, రామచంద్రరావు పేర్లు వినిపిస్తున్నాయి. మరోవైపు అధ్యక్ష పదవి వద్దంటూనే దూకుడు ప్రదర్శిస్తున్నారు బండి సంజయ్. ఇక, కొత్తగా తెరపైకి డీకే అరుణ, మురళీధర్ రావు పేర్లు వచ్చినట్లు సమాచారం.

తలనొప్పిగా మారిన పార్టీ చీఫ్ ఎన్నిక..

ఇతర రాష్ట్రాల్లో బీజేపీ అధ్యక్షుల ఎన్నిక ఒక కొలిక్కి వచ్చిందని చెప్పొచ్చు. పార్టీ చీఫ్ ఎవరు అనేదానిపై కొంత ఏకాభిప్రాయం వచ్చింది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం స్టేట్ పార్టీ చీఫ్ గా ఎవరిని నియమించాలి అనేది బీజేపీ అధిష్టానానికి కొంత తలనొప్పిగా మారింది. తెలంగాణ బీజేపీ నేతల తీరుతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఒకరిపై ఒకరు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు.

అధ్యక్ష రేసులో కీలక నేతలు..

బీజేపీ చీఫ్ రేసులో ప్రధానంగా ఎంపీలు ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, రఘునందన్ రావు పేర్లు వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. వీరితో పాటు బండి సంజయ్ పేరు కూడా కీలకంగా వినిపిస్తోంది. అయితే, నేను ఇప్పటికే కేంద్ర మంత్రిగా ఉ న్నాను, నాకు అధ్యక్ష పదవి వద్దు, ఒకరికి రెండు పదవులు సాధ్యం కావని, రెండు పదవులను బ్యాలెన్స్ చేయడం సాధ్యం కాదని ఇంటర్నల్ గా సన్నిహితులతో చెబుతున్నారు.

# పారిపోయిన వల్లభనేని..! తెర వెనుక రాజకీయం



అమరావతి,ఏపీలో వైసీపీ ఓటమి తర్వాత నియోజకవర్గానికి దూరమైన ఆ నేత ఇప్పుడు తిరిగి యాక్టివ్ అవ్వడానికి తెర వెనక చక్రం తిప్పుతున్నారట. ఘోరపరాజయం తట్టుకోలేక ఓట్ల కౌంటింగ్ రోజే ఫ్యామిలీతో సహా సెగ్మెంట్ నుంచి బిచాణా ఎత్తేసిన ఆయన.. ఇంత కాలం ఎక్కడున్నారో కూడా అక్కడ ప్రజలకు ఆచూకీ లేకుండా పోయింది. దాంతో ఆయన తిరిగి సొంత సెగ్మెంట్‌కి తిరిగొస్తారా? లేదా ? అన్న చర్చ మొదలైంది. ఇప్పుడు ఆ చర్చకు ఫుల్ స్టాప్ పెట్టే పనిలో పడ్డారంట. సొంత కేడర్‌ను కాపాడుకుంటూ తానమేంటో నిరూపించుకోవడానికి తెర వెనుక వ్యూహాలు పన్నుతున్నారంట. ఇంతకీ ఎవరా మాజీ ఎమ్మెల్యే? ఆయన రీ యాక్టివ్ అవ్వడానికి ఏ నియోజకవర్గంలో పావులు కదుపుతున్నారు?కృష్ణ జిల్లా గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ.. నోటి దూకుడుతో అత్యంత వివాదాస్పదమైన నేతగా పాపులార్టీ సొంతం చేసుకున్న మాజీ ఎమ్మెల్యే. టీడీపీ నుంచి పొలిటికల్ ఎంట్రి ఇచ్చి విజయవాడ ఎంపీగా పోటీ చేసిన ఆయన ఓటమి పాలయ్యారు. తర్వాత గన్నవరం టీడీపీ ఎమ్మెల్యేగా వరుసగా రెండు సార్లు విజయం సాధించారు. 2019లో రెండో సారి గెలిచాక టీడీపీ అధికారంలోకి రాకపోవడంతో తన దారి తాను చూసుకుని వైసీపీ పంచకు చేరారు. మళ్లీ వైసీపీనే అధికారంలోకి వస్తుందన్న ధీమాతో టీడీపీ ముఖ్య నేతలపై ఇష్టానుసారం నోరు పారేసుకుంటూ చెలరేగిపోయారు.గత ఎన్నికల ఓట్ల కౌంటింగ్ రోజు పోలింగ్ సరళిని గమనించి కౌంటింగ్ కేంద్రం నుంచి మధ్యలోనే మాయమయ్యారు. అటు రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ కూడా ఘోర పరాజయం పాలవ్వడంతో నియోజకవర్గానికి దూరంగా, కేడర్ కే అందుబాటులోకి లేకుండా పోయారు. ఎంతలా అంటే ఆయన ఎక్కడున్నారా? అని అధికార పార్టీ నేతలు ఆరా తీసినా కూడా ఆచూకీ దొరకలేదంట. మధ్యలో ఒకసారి తాడేపల్లిలో జిల్లా వైసీపీ సమీక్షా సమావేశానికి హాజరైన ఆ మాజీ ఎమ్మెల్యే.. మాజీ మంత్రులు పేర్ని నాని, కొడాలి నానిలతో కలిసి మీడియా ముందుకు వచ్చినప్పటికీ.. మాట్లాడకుండానే గాయబ్ అయిపోయారు.వల్లభనేని వంశీ కోసం 7 నెలలుగా ఇటు సొంత పార్టీ నేతలు, అటు అధికార పార్టీ నేతలు ఎంత అచూకీ తీసినా ఎక్కడ ఉన్నారో కూడా కనిపెట్టలేకపోయారు. టీడీపీ ముఖ్య నేతలతో పాటు, చంద్రబాబు ఫ్యామిలీపై ఇష్టం వచ్చినట్లు నోరు పారేసుకున్న వల్లభనేని వంశీపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడగానే విజయవాడలోని ఆయన ఇంటిపై దాడికి కూడా ప్రయత్నించడంతో పోలీసులు ఎంటరై పరిస్థితి చక్కదిద్దాల్సి వచ్చింది. గన్నవరం టిడిపి కార్యాలయం పై దాడి కేసులో ఏ 71 గా వంశీని ఎలాగైనా అరెస్టు చేయాలని పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేసినా ఆయన దొరకలేదు. ఆ కేసులో వంశీ మినహా అందరిని పోలీసులు ఇప్పటికే అరెస్టు చేశారు. అయితే వంశీ మాత్రం ఎక్కడ ఉన్నారో అటు పోలీసులకు ఇటు టీడీపీ నేతలకు అంతు చిక్కలేదు.ఆ క్రమంలో వంశీ రాష్ట్రాన్ని దాటి విదేశాలకు వెళ్లారని ప్రచారం జరిగితే మరి కొంత మంది మాత్రం పక్క రాష్ట్రాల్లో తలదాచుకున్నారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అటు చూస్తే 2019 ఎన్నికల్లో వంశీపై వైసీపీ నుంచి పోటీ చేసి ఓడిపోయిన యార్లగడ్డ వెంకట్రావు గత ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీ చేసి ఘన విజయం సొంతం చేసుకున్నారు. ఇటు వంశీ కనిపించకుండా పోవడంతో గన్నవరం నియోజకవర్గంలో వైసీపీ అనాథలా తయారైంది. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలు, దౌర్జన్యాలకు సంబంధించి వంశీ అనుచరులు అరెస్ట్ అవుతున్నా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది.ఆ ఎఫెక్ట్‌తో సొంత పార్టీ శ్రేణుల నుంచి వస్తున్న విమర్శలకు ఇప్పుడు తెర వెనక ఉండే సమాధానం చెప్పే ప్రయత్నం చేస్తున్నారంట వంశీ.. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గన్నవరం నియోజకవర్గంలో పరిణామాలు శరవేగంగా మారిపోయాయి. వరుస అరెస్టులతో వైసీపీ శ్రేణులు బెంబేలెత్తిపోతున్నాయి. వంశీ కూడా అరెస్ట్ భయంతోనే పలాయనం చిత్తగించారన్న ప్రచారం జరుగుతుంది. ఇప్పుడు ఆ ప్రచారానికి సైలెంట్ గా చెక్ పెట్టే ప్రయత్నం చేస్తున్న వంశీ.. గన్నవరం నియోజకవర్గం వైసీపీలో జరుగుతున్న, మారుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తున్నారని ఆయన అనచరులు అంటున్నారు.ముఖ్యంగా గన్నవరం నియోజకవర్గంలో వైసిపి ముఖ్య నేతలే టార్గెట్‌గా గత 7 నెలల వ్యవధిలో నమోదైన కేసులు, అరెస్టులు, దాడులు లాంటి అంశాల విషయంలో వంశీ పార్టీ వారికి నేనున్నాను అనే భరోసాను ఇస్తున్నారట. గన్నవరం టీడీపీ కార్యాలయం పై దాడి కేసులో 89మంది నిందితులను చేర్చగా .. తాను కూడా ఒక నిందితుడైన వంశీ మిగిలిన వారికి ఏ రకమైన సహాయసహకారాలు అందించలేదని వైసీపీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పాత కేసులు మొత్తం తిరగదోడుతుండటంతో గన్నవరం నియోజకవర్గంలో నెలకొన్న పరిణామాలు, నేతలపై నమోదైన కేసులను మాజీ ఎమ్మెల్యే సీరియస్‌గా తీసుకున్నారంట.అందులో భాగంగా కేసులకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారంట. జిల్లా స్థాయిలో స్పెషల్ కోర్టులో బెయిల్ వ్యవహారాలు చూడటానికి ఒక టీమ్‌ని.. అవసరమైతే సుప్రీంకోర్టు, హై కోర్టు మెట్లు ఎక్కడానికి ఒక టీమ్‌ని ప్రత్యేకంగా నియమించి కేసుల బాధ్యతను భుజానికెత్తుకున్నారంట. అనేక కేసుల్లో ఇటీవల వంశీ ప్రధాన అనుచరులతో పాటు కీలక నేతల అందరి పైన కేసు నమోదు అయ్యాయి. పలువుర్ని అరెస్టు చేశారు. దాంతో వారికి భరోసా కల్పించడానికి.. వారి కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడంతో పాటు.. న్యాయపరమైన వ్యవహారాలను తెర వెనుక ఉండి సూపర్‌వైజ్ చేస్తున్నారంటనోరు జారి వంశీ చేసిన విమర్శలు అప్పట్లో పెద్ద కలకలమే రేపాయి. వంశీ ప్రోద్భలంతో గన్నవరం నియోజకవర్గంలో జరిగిన దాడులకు ప్రస్తుతం వైసీపీ శ్రేణులు మూల్యం చెల్లించుకుంటున్నాయి. వంశీ సైతం కేసులు చట్రంలో ఇరుక్కున్నారు. దాంతో ఆయన నియోజక వర్గానికి ముఖం చాటేస్తున్నారు. అయితే దీర్ఘ కాలం కేడర్‌కు అందుబాటులో లేకుండా పోతే.. రాజకీయంగా అసలుకే ఎసరు వస్తుందనుకున్నారో ఏమో? వంశీ తిరిగి యాక్టివ్ అవ్వడానికి గ్రౌండ్ ప్రిపేర్చేసుకుంటున్నారంట. తనతో పాటు వైసీపీ వారిపై పెట్టిన కేసులకు సంబంధించి న్యాయ నిపుణులతో చర్చిస్తూ వాటి నుంచి బయట పడే పనిలో ఉన్నారంటున్నారు.వైసీపీ వారికి ఆర్థికంగా అండగా నిలబడుతూ.. కేసుల చిక్కులు తొలగిపోగానే నియోజకవర్గానికి వచ్చి అందర్నీ కలుస్తానని తన వారితో చెప్పిస్తున్నారంట. తాను ఎక్కడున్నాననేది ఇప్పుడు అప్రస్తుతమని, ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నుంచి అందరూ బయట పడ్డాక పార్టీ యాక్టివిటీస్ మొదలుపెడతామని సూచిస్తున్నారంట. కేసులు దాడులు, అరెస్టులపై ఆందోళన చెంద వద్దని, తన కేసుకు సంబంధించి ఒక క్లారిటీ వచ్చాక నియోజకవర్గంలోనే త్వరలో సమావేశాన్ని నిర్వహించి నేతలందరినీ కలుస్తానని రాయబారాలు పంపుతున్నారంట. తన రాజకీయ భవిష్యత్తు కోసం వంశీ పడుతున్న పాట్లు ప్రస్తుతం గన్నవరం సెగ్మెంట్లో హాట్ టాపిక్‌గా మారాయి. వంశీ ప్రయత్నాలు ఫలించి తమ వారు బెయిలుపై బయటకు వస్తే చాలని నిందితుల ఫ్యామిలీలు ఎదురు చూస్తున్నాయి. చూడాలి మరి వంశీ అన్నీ చక్క పెట్టుకుని ఎప్పుడు వస్తారో?

# మోడీకి కలిసి వస్తున్న విఫల ప్రతిపక్షం !



న్యూఢిల్లీ,బాధ్యతలేని ప్రతిపక్షాల కారణంగా మోడీ ప్రభుత్వానికి చెక్ పెట్టే అవకాశం లేకుండా పోతోంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తన బాధ్యతను సరిగా నిర్వహించలేక పోతోంది. దేశం ఏమైపోతున్నా పట్టించుకోవడం లేదు. బడ్జెట్ సమావేశాల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా సమస్యలపై చర్చిస్తారని ఆశిస్తున్న దేశ ప్రజల అడియాశలు కాక తప్పడం లేదు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. రాష్ట్రపతిపై తల్లీకుమారులు సోనియా, రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారి అహంకారానికి ఇది పరాకాష్ట అని చెప్పాలి. ఇకపోతే అనవసర సమస్యలపై మాట్లాడుతున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చకు సిద్దంగా ఉండడం లేదు. ఒకప్పుడు బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలను చూస్తే అధికార పక్షం వణికి పోయేది. ఏ సమస్యను ఎక్కడ లేవదీస్తారో అన్న భయం ఉండేది. ప్రతిపాదనల్లో కోతలు విధించేవారు. సవరణలకు పట్టుబట్టేవారు. అదనపు కేటాయింపులు జరిగేలా చూసేవారు. కమ్యూనిస్టుల ప్రధానంగా ఈ పాత్ర పోషించేవారు. కానీ కమ్యూనిస్టులు లేకపోవడం, ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారానికి బాగా అలవాటై పోవడం వల్ల ప్రతిపక్ష బాధ్యతలను సరిగా నిర్వహించడం లేదు. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం వెండి ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి.ఉప్పులు,పప్పులు సామాన్యుడికి అందనంతగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో సమావేశాల్లో ఒక్కో సమస్యపై చర్చించినా సమయం సరిపోదు. కానీ కాంగ్రెస్, ఇతర విపక్ష సభ్యులు అనవసర సమస్యలను నెత్తికి ఎత్తుకుని సభా సమయాన్ని వృధా చేసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొడుతూ కాలక్షేపం చేస్తోంది. పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలవ ుయంగా మారింది. వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశానని ప్రధాని మోడీ పదేపదే చెబుతున్నారు. అయితే పెరుగుతున్న ధరలతో సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలి గినపుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే.. ఎండమావిని చూపి నీళ్లు తాగమనే మాటలు చెబుతున్నారన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్ర్య భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని పదేపదే చెబుతున్నారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ సడలింపులపై ఒక్కరూ మాట్లాడడం లేదు. తానో గొప్ప విజనరీ అని చెబుతున్న చంద్రబాబు కూడా దీనిపై ఎక్కడా చర్చించడం లేదు. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేవలం పొగడ్తలకే పరిమితమయ్యారు. ఏ అంశాన్ని కదిలించడం లేదు, కదిలిస్తే తన రాష్టానికి ఎక్కడ నిధులు రావో అన్న భయం ఆయనలో ఉంది. నితీశ్ కుమార్ తదితరులు కూడా ప్రేక్షకులుగా మారారు. ప్రధాన ప్రతిపక్షమే నాయకత్వ లోపంతో ఉంది. రాహుల్‌కు దేశంపైనా, సమస్యలపైనా అవగాహన లేకుండా పోవడం కూడా ఇందుకు కారణమని చెప్పుకోవాలి. నిజానికి జిఎస్టీపై తక్షణం ఈ సమావేశల్లో చర్చించాలి. దానివల్ల కలుగుతున్న దుష్పరిణామాలను చర్చించాలి. పన్నుల వల్ల ప్రజలు ఎంతగా దెబ్బతింటున్నారో చర్చించాలి. కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఈ ఒక్క అంశంపై ఎన్నిరోజులైనా చర్చించేందుకు నిలబడగలగాలి. కానీ ఆ పని చేయడం లేదు. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 70 వేల కోట్లకు చేరడం చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలపై పన్నుల కొరడా అని గుర్తించడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితు ల్లో ఉన్నారు. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉ ప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండ లేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణ లు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను సడలింపులు, ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపులు కేవలం పైపూతలు మాత్రమే. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, జిఎస్టీ వంటి అంశాలపై పార్లమెంటులో చర్చించాలి. ఇందుకు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కసరత్తు చేయాలి. ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ప్రజల్లో ఇమేజ్ పొందాలంటే ఇదే సమయం.

# సీఐడీ అధికారుల ఎదుట గైర్హాజరైన రాంగోపాల్ వర్మ

అమరావతి,గుంటూరు సీఐడీ అధికారుల ఎదుట విచారణకు డైరెక్టర్ రాంగోపాల్ వర్మ గైర్హాజరయ్యారు. సోమవారం విచారణకు రావాల్సిందిగా ఆర్జీవీకి సీఐడీ నోటీసులు ఇచ్చింది. అయితే తాను సినిమా ప్రమోషన్‌లో ఉన్నందున విచారణకు రాలేనని నిన్ననే సీఐడీకి సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో సోమవారం ఆర్జీవీ తరపున అతని న్యాయవాది నాని బాబు గుంటూరు సీఐడీ కార్యాలయానికి వచ్చారు. ఎనిమిది వారాల పాటు విచారణకు హాజరుకాలేరని.. ఎనిమిది వారాల పాటు సమయం ఇవ్వాలని లిఖిత పూర్వకంగా సీఐడీ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. అయితే ఈ నోటీసులపై సీఐడీ అధికారులు ఎలా స్పందిస్తారనే ఆసక్తి నెలకొంది. కమ్మ రాజ్యంలో కడప రెడ్లు సినిమాపై సీఐడీకి టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు. తమ మనోభావాలు దెబ్బతినేలా సినిమా ఉందని ఆర్జీవీపై ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రకాశం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఆర్జీవీ విచారణ జరిగింది. ఈ నేపథ్యంలో ఇప్పుడు సీఐడీ కూడా ఆర్జీవీని విచారించాలని నిర్ణయించింది. అయితే సీఐడీ విచారణకు దర్శకుడు గైర్హాజరవడంతో తదుపరి కార్యాచరణ ఎలా ఉండబోతుంది అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. సోమవారం సీఐడీ అధికారులు విచారణ కోసం డైరెక్టర్ రాంగోపాల్ వర్మను గుంటూరు సీఐడీ కార్యాలయానికి రమ్మన్నారని.. విచారణ హాజరుకావడానికి కొంత టైం అడిగామమని న్యాయవాది నానిబాబు తెలిపారు. దానికి సంబంధించిన వినతి పత్రాన్ని అధికారులకు అందించామన్నారు. సీఐడీ విచారణకు హాజరుకావడానికి రాంగోపాల్ వర్మ 8 వారాలు టైం అడిగారని ఆర్జీవీ అడ్వకేట్ నానిబాబు వెల్లడించారు. కాగా.. ఇటీవల ఒంగోలు సీఐ ముందు ఆర్జీవీ విచారణకు హాజరైన విషయం తెలిసిందే. ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి రాంగోపాల్ వర్మ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనిపై గత ఏడాది నవంబర్ 10న వర్మపై మద్దిపాడు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. నవంబర్ 19, 25 తేదీల్లో రెండు సార్లు నోటీసులు ఇచ్చినా ఆయన విచారణకు హాజరుకాలేదు. పోలీస్ విచారణకు హాజరుకాకుండా కొద్ది రోజులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేయకుండా ఉండేందుకు న్యాయస్థానాన్ని ఆశ్రయించి ముందస్తు బెయిల్ పొందారు ఆర్జీవీ. ఈనెల 4న విచారణకు రావాలని పోలీసులు మరోసారి నోటీసులు ఇవ్వగా.. ఈనెల 7న విచారణకు హాజరయ్యారు రాంగోపాల్ వర్మ. దాదాపు 12 గంటల పాటు ఆర్జీవీ విచారణ కొనసాగింది.

# అవినీతి ఆరోపణలతోనే పతనం..

న్యూఢిల్లీ,ఢిల్లీలో ఊపిరి పోసుకున్న అమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ పార్టీగా ఎదిగి పంజాబ్ లో అధికారం కైవసం చేసుకుని 12ఏళ్లు ఢిల్లీని పరిపాలించి అవమానకర పరిస్థితుల్లో అధికారాన్ని కోల్పోయింది. కాంగ్రెస్, బీజేపీ లను వ్యతిరేకించిన పార్టీగా, అవినీతిని దనుమాడుతామంటూ రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆప్ ఆ తరువాత రాజకీయ పరమపద సోపానపటంలో అవినీతి అనే పెద్ద పాము చేతిని చిక్కి పతనమైంది. అవినీతిపై పోరాటం అన్న నినాదాన్ని పక్కన పెట్టి స్వయంగా అవినీతి ఆరోపణల్లో కూరుకుపోయింది. అలాగే రాజకీయ చదరంగం కూడా ఆడి ఆ ఆటలో బీజేపీ ఎత్తులకు చిత్తైపోయింది. బీజేపీ వ్యతిరేక కూటమి అయిన ఇండియా కూటమిలో భాగస్వామి అయి కూడా తాజా ఎన్నికలలో ఒంటరిగా బరిలోకి దిగి.. చేజేతులా ఇండియా కూటమి ఓట్లు చీలి తన ఓటమికి కారణమయ్యేలా చేసుకుంది. దశాబ్దానికి పైగా ఢిల్లీలో అధికారంలో ఉండి కూడా కనీసం సౌకర్యాల కల్పనలో విఫలమైంది. ఉచితాలనే నమ్ముకుని బొక్కబోర్లా పడింది. ఆప్ 2012లో పుట్టి,2013 ఢిల్లీ ఎన్నికల్లో మొదటిసారి కాంగ్రెస్ మద్దతుతో అధికారంలోకి వచ్చింది. 2015లో జరిగిన ఎన్నికల్లో 70 స్థానాలకు గాను 67 స్థానాలు కైవసం అఖండ మెజారిటీతో అధికారంలోకి వచ్చింది. ఐదేళ్ల తరువాత .2020 లో జరిగిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో కూడా కూడా62 స్థానాలు సాధించి సత్తా చాటుకుని అధికారాన్ని నిలబెట్టుకుంది. అయితే మళ్లీ ఐదేళ్లు గిర్రున తిరిగే సరికి ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుని పరాజయం పాలైంది. 26 ఏళ్లుగా బీజేపీకి అందని ద్రాక్షలా నిలిచిన హస్తిన పీఠాన్ని పువ్వుల్లో పెట్టి మరీ ఆ పార్టీకి ఈ సారి బీజేపీ 48 స్థానాలు కైవసం చేసుకుని అధికార పగ్గాలు అందుకుంది. ఈ పరాజయానికి ఆప్ స్వయంకృతాపరాధమే కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఈ పరాజయంతో ఆప్ తాను స్వయంగా ఓడిపోవడమే కాకుండా.. ఇండియా కూటమి ఐక్యతను కూడా ప్రశ్నార్ధకం చేసింది.మిత్రధర్మాన్ని పాటించడానికి అహంకారంతో అంగీకరించకపోవడం కారణంగా, అంటే కాంగ్రెస్ తో పొత్తుకు నిరాకరించడం కారణంగా ఆప్ కనీసం 14 స్థానాలలో స్వల్ప తేడాతో ఓడిపోయి ంది. ఆప్ పార్టీకి పోలైన ఓట్ల శాతం చూస్తే ఇది స్పష్టంగా అర్ధమౌతుంది. కాంగ్రెస్ కు పోలైన 7 శాతం ఓట్లు ఆప్ ఓటమిని లిఖించాయి. అన్నిటికీ మించి.ఈ ఎన్నికల్లో ఆప్ అధినేత అరవింద్ క్రేజీవాల్,ఆ పార్టీ కీలక నేత, మాజీ ఉ పముఖ్యమంత్రి మనీష్ సిసోడియా కూడా పరాజయం పాల య్యారు. ఢిల్లీలో దెబ్బతిన్న రహదారులు, ఫ్లై ఒవర్లపై గుంతలు, తాగునీటి సమస్య .యమున జలాలను శుద్ధి చేస్తామని ఇచ్చిన హామీని పూర్తిగా విస్మరించడం, ఎన్నికలకు ముందు ఆ యమునా జలాలను కలుషితం చేస్తున్నది హర్యానాలోని బీజేపీ సర్కార్ అంటూ ఆరోపణలు చేసి అభాసుపాలు కావడం ప్రధాన కారణాలు గా చెప్పవచ్చు. అలాగే ఢిల్లీలో పేరుకుపోతున్న చెత్త కూడా ఆప్ ను ప్రజలు ఊడ్చేయడానికి ఒక కారణంగా పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇప్పటి వరకూ ఆప్ తన పరాజయాన్ని తానే ఎలా శాశించుకుందో చెప్పుకున్నాం. ఇప్పుడు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో ఆమ్ ఆద్మీ పార్టీ ఆధిపత్యానికి పకడ్బందీ వ్యూహాలతో, ప్రణాళికా బద్ధంగా బీజేపీ ఎలా చెక్ పెట్టిందో చెప్పుకుందాం. అవినీతిపై అలుపెరుగని పోరాటం అంటూ మొదలైన కేజ్రీవాల్.. ఆమ్ ఆద్మీ పార్టీని దేశ వ్యాప్తంగా విస్తరించాలని ప్రణాళికలు రూపొందించారు. ఆ దిశగా గత పదేళు ్లగా అడుగులు వేశారు. పంజాబ్ లో అధికార పగ్గాలు ఆప్ చేతికి దక్కాయి. కానీ బీజేపీ ఆయన ఆశలకు, ఆకాంక్షలకు కళ్లెం వేసింది. సొంత రాష్ట్రంలోనే ఆప్ ను ఓడించింది. ఇందు కోసం ఆప్ లో చీలిక తీసుకువచ్చింది. పార్టీ నేతలను, క్యాడర్ ను పట్టించుకోకుండా వ్యవహరించిన కేజ్రీవాల్ పై సొంత పార్టీలోనే తీవ్ర అసంతృప్తి వ్యక్తం అయ్యేలా చేసింది. ముఖ్యంగా ఒకప్పుడు కేజ్రీవాల్ పార్టీలో కీలకంగా ఉన్న స్వాతి మలివాల్..ఆయనకు బద్ధ వ్యతిరేకిగా మారారు. ఆప్ నాయకుడు, కేజ్రీవాల్ సన్నిహితుడు తనపై దాడికి పాల్పడినా కేజ్రీవాల్ పట్టించుకోకపోవడమే స్వాతి మలివాల్ పార్టీలో రెబల్ గా మారడానికి కారణం. మౌలికసదుపాయాలు కల్పించడంలో విఫలమైన క్రేజీ వాల్ అనే నినాదాన్ని హైలైట్ చేసారు. క్రేజీవాల్ ఓటమిని సోషల్ మీడియాలో మహాభారతం లో "ద్రౌపతి వస్త్రాపహరణం"పోస్టర్ పెట్టి తన ఆక్రోశాన్ని తీర్చుకున్నారంటే పార్టీలో ఆయన పట్ల ఎంత వ్యతిరేకత గూడు కట్టుకుందో అర్ధం చేసుకోవచ్చు. అంతే కాదు కేజ్రీవాల్ అహంకారాన్ని రావణాసురుడి గర్వంతో పోల్చారు. అధికార,ధన దాహం, అవినీతి ఆప్ నైజం అంటూ బీజేపీ చేసిన ప్రచారం క్షేత్రస్థాయిలోకి వెళ్లిపోయింది. కేజ్రీవాల్ గురువు, అవినీతి వ్యతిరేక ఉద్యమ సారథ, సామాజిక ఉద్యమ కారుడు అన్నాహజారే కూడా ఆప్ పరాజయాన్ని స్వాగతించారు. ఇలా అన్ని వర్గాలలోనూ ఆప్ ప్రతిష్ట మసకబారింది. అందుకే మూడు సార్లు ముఖ్యమంత్రిగా పని చేసిన క్రేజీవాల్ ప్రస్థానం ఒక సామాన్యుడు పర్వేజ్ శర్మ చేతిలో 1844 ఓట్ల తేడాతో ఒటమిపాలయ్యారు.

# సంక్షేమ పథకాల అమల్లో అధికారులకు సూచనలు



హైదరాబాద్,తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అధికారుల కు కీలక సూచనలు చేస్తోంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు దిశగా కసరత్తు కొనసాగు తోంది. అందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ విషయంలో తాజాగా అధికారులకు కీలక సూచనలు అందాయి. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఇక, ఈ గ్రామాల్లో ఇళ్ల గ్రౌండింగ్ కోసం ఏర్పాటు ప్రారంభించారు. ముందుగా ఆ గ్రామాల్లో ప్రీ గ్రౌండింగ్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రీ గ్రౌండింగ్ తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారలు కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రీ గ్రౌండింగ్ సమావేశాల నిర్వహణ దిశగా కసరత్తు చేస్తోంది. ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం లో అనుసరిం చనాల్సిన విధానాలు.. నిర్మాణ సామాగ్రి.. ఎలా నిర్మాణం చేపట్టాలనే వాటితో పాటుగా వారి సందే హాలకు పరిష్కారం చూపేలా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే లబ్ది దారులకు పథకం అమలుకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేసింది. అందులో భాగంగా ఇందిరమ్మ యాప్ సర్వే సమయంలో సొంత స్థలం చూపిన ప్రాంతంలో లబ్ధిదారుడే ముగ్గు పోసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారుడు మరోచోట ఇల్లు కట్టుకుంటానంటే ఆ ఇంటిని అధికారులు రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 47 ఏళ్ల ముసలి సీఎంను రహస్యంగా పెళ్లి చేసుకున్న నందమూరి హీరోయిన్ లబ్దిదారుల కోసం తమ స్థలంలో లబ్దిదారుడు ముగ్గు పోసుకొని సిద్ధమైన తరువాత సమాచారం ఇస్తే గ్రామ కార్యదర్శి అక్కడకు వచ్చి వారిని ఫొటోలు తీసుకొని ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తారు. నిర్మాణ ప్రదేశాన్ని జియో ట్యాగింగ్ చేసి ఇస్తారు. అదే విధంగా ప్రతీ లబ్దిదారుడు కనీసం 400 చదరపు అడుగులు కంటే తక్కువ కాకుండా ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసారు. పునా ది పూర్తయిన తర్వాతే మొదటి విడతలో రూ.లక్షను లబ్ధిదారుడి ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని నిర్ణయించగా, దీనికి సంబంధించి కూపన్లను తహసీల్దార్ లేదా ఆర్డీవో ద్వారా అందించాలని స్పష్టం చేసారు. నియోజకవర్గాల వారీగా ప్రభుత్వం మొదటి విడతలో 71,482 ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించింది. కాగా, ఇందులో 21 నియోజకవర్గాల్లో 1000కి పైగా ఇళ్లను ఇవ్వనుంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,528 ఇళ్లు , మంథని 1,952, బోథ్ 1,538, పరకాల 1,501 ఇళ్ల పంపిణీకి నిర్ణయించారు. ఆ తరువాత వరుసగా హుస్నాబాద్, సిర్పూర్, దుబ్బాక, పరిగి, బెల్లంపల్లి, జహీరాబాద్ వంటి నియోజకవర్గాల ల్లో ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించారు. మిగిలిన నియోజకవర్గాల్లో వెయ్యి వరకు ఇళ్లను ఇచ్చేందుకు ఎంపిక చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై కసరత్తు కొనసాగుతున్న వేళ పథకాల అమలు విషయంలో కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి.

# ఢిల్లీ విజయంలో ఒకే ఒక్కడు.. మోదీని మించి..

న్యూఢిల్లీ,ప్రస్తుతం బీజేపీలో నరేంద్ర మోదీ, అమిత్ షా తిరుగులేని నాయకులు.. వీరి వ్యూహాలను తట్టుకుని నిలబడటం సాధ్యమయ్యే పనికాదు. ఎక్కడ ఎన్నిక జరిగినా గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచించడంలో వీరిని మించినవారు లేరని కొందరు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. దేశంలో బీజేపీ బలంగా లేని ప్రాంతాల్లో ఆ పార్టీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటుతుందంటే దానికి ప్రధాన కారణం మోదీ, అమిత్ షా వ్యూహాలే. 2014లో మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటినుంచి ఢిల్లీలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే వీరిద్దరి ఆకాంక్ష నెరవేరలేదు. ఆప్ ముందు వీరి వ్యూహాలు రెండు సార్లు పనిచేయలేదు. మోదీ, అమిత్ షాలకు సాధ్యం కాని లక్ష్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు ఢిల్లీకి చెందిన ఓ బీజేపీ నేత. 70 శాసనసభ స్థానాలున్న ఢిల్లీలో 48 స్థానాల్లో గెలుపొందిన బీజేపీ ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయనుంది. ఢిల్లీలో ఎంతో బలమైన ఆప్ వంటి పార్టీని ఎదుర్కొని, బీజేపీకి ఘన విజయం అందించడంలో ఓ వ్యక్తి పాత్రను తప్పకుండా ప్రస్తావించాల్సిందే. ఇంతకీ ఆ వ్యక్తి ఎవరు.. బీజేపీ విజయానికి ఎలా కారణమయ్యారో తెలుసుకుందాం.

ఒకే ఒక్కడు..

ఢిల్లీలో కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని గద్దెదించి.. తాము అధికారం చేపట్టాలనే బీజేపీ ప్రయత్నం రెండుసార్లు ఫలించలేదు. అయినప్పటికీ ఆప్‌పై బీజేపీ తమ పోరాటాన్ని కొనసాగిస్తూనే ఉంది. అరవింద్ కేజ్రీవాల్ సైతం కేంద్రప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేసేవారు. ఆప్, బీజేపీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. మరోవైపు సంక్షేమ పథకాలతో పేద, మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకోవడంతో.. ఆ వర్గాలు కేజ్రీవాల్‌కు బలమైన ఓటుబ్యాంకుగా మారింది. ఈ పరిస్థితుల్లో ఆప్‌ను ఓడించడం బీజేపీకి ఈ జన్మలో సాధ్యం కాదని కేజ్రీవాల్ సైతం ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు. అవినీతి రహిత పాలన లక్ష్యంగా పార్టీ పెట్టి, సామాన్యుడి ప్రతినిధిగా రాజకీయాల్లోకి వచ్చి ఢిల్లీలో అధికారం చేపట్టిన కేజ్రీవాల్ ప్రభుత్వంపై మద్యం కుంభకోణం ఆరోపణలు రావడంతో వారి ప్రతిష్ట దిగజారుతూ వచ్చింది. ఆ మద్యం కుంభకోణాన్ని బయటకు తీసుకొచ్చిన వ్యక్తి పర్వేశ్ వర్మ. ఆయన ఆధారాలు సేకరించి అధిష్టానానికి చెప్పడంతో.. ప్రొసీడ్ అంటూ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పర్వేశ్ కేజ్రీవాల్ అవినీతిపై పోరాడారు. ఆప్ అధికారాన్ని



కోల్పోవడంతో పాటు.. న్యూఢిల్లీ నియోజకవర్గంలో కేజ్రీవాల్ ఓడిపోవడానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ అనే చర్చ జరుగుతోంది.

మద్యం పాలసీపై అనుమానంతో..

ఢిల్లీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీలో అవకతవకలు జరిగాయనే సమాచారంతో పర్వేశ్ వర్మ మొత్తం వివరాలు సేకరించే పనిలో పడ్డారు. లిక్కర్ పాలసీలో అక్రమాలు జరిగాయని బీజేపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. మీరు అనుమతిస్తే దీనిని బయటపెడతానని చెప్పారు. ముందుగా ఆధారాలు సేకరించాలని పర్వేశ్‌కు బీజేపీ హైకమాండ్ సూచించింది. దీంతో హోటల్స్‌లో జరిగిన సమావేశాల వీడియోలను బయటకు తీశారు. మద్యం వ్యాపారంతో లింకులున్న వ్యక్తులు, పలువురు రాజకీయ ప్రముఖులు తరచూ సమావేశం కావడంపై అనుమానంతో అసలు ఏం జరుగుతుందనేదానిపై పూర్తిస్థాయి వివరాలు సేకరించడంతో ఢిల్లీ మద్యం కుంభకోణం అంశం వెలుగులోకి వచ్చింది. పర్వేశ్ సేకరించిన వీడియోల ద్వారానే ఎమ్మెల్సీ కవిత పేరు బయటకు వచ్చింది. అప్పటినుంచి కేజ్రీవాల్ అవినీతిపై బీజేపీ తన పోరాటాన్ని కొనసాగిస్తూ వచ్చింది. ప్రజల్లోకి బలంగా లిక్కర్ స్కామ్ అంశాన్ని తీసుకెళ్లగలిగింది. చివరకు ఇటీవల జరిగిన ఢిల్లీ శాసనసభ ఎన్నికల్లో ఆప్‌ను ఓడించి బీజేపీ తన లక్ష్యాన్ని చేరుకుంది. ఈ లక్ష్య సాధనలో కీలకపాత్ర పోషించారు పర్వేశ్ వర్మ. ప్రస్తుతం ఢిల్లీ ముఖ్యమంత్రి రేసులో ఆయన పేరు వినిపిస్తోంది.

# కేటీఆర్ ట్వీట్స్ పార్టీకి నష్టం చేస్తున్నాయా ?

హైదరాబాద్,బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి అయిన కేటీఆర్ ప్రతీ విషయం మీద ట్వీట్లు పెడుతూంటారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆ విధంగా ఎండగడుతూంటారు. ఎక్కడ ఏ సంఘటన జరిగినా ప్రభుత్వానికి సంబంధం చూపుతూ ఆయన ట్వీట్లు వేస్తారు. దీని వల్ల జనంలో చర్చ సాగాలని సర్కార్ బదనాం కావాలన్న ఎత్తుగడలతోనే ఇదంతా చేస్తున్నారు.రాజకీయాల్లో ఇది ఒక విధానంగా ఉన్నా కేటీఆర్ ఉన్న పార్టీ బీఆర్ఎస్ పదేళ్ళ పాటు తెలంగాణాను ఏలిన పార్టీ. కేటీఆర్ కూడా మంత్రిగా పదేళ్ళ పాటు పనిచేశారు. మరి సమస్యలు ఎపుడూ ఉంటూనే ఉంటాయి. ఒక సమస్యను విపక్షంగా వీరు చెబితే మీ హయాంలో పది సమస్యలు చెప్పమంటారా అని అధికార కాంగ్రెస్ నేతలు రివర్స్ లో ఎటాక్ చేస్తూంటారు. అది వారి రాజకీయ వ్యూహం.దీంతో ఒక ఇష్యూతో కాంగ్రెస్ ని కార్నర్ చేయబోయి మరిన్ని ఇష్యూస్ తో కేటీఆర్ చిక్కుకుంటున్నారా అన్న చర్చ అయితే వస్తోంది. ఇవే కాదు రాజకీయంగా కూడా కేటీఆర్ వేసే ట్వీట్లు కూడా ఎదురు తంతున్నాయని బీఆర్ఎస్ ని బూమరాంగ్ చేస్తున్నాయని అంటున్నారు. ఉదాహరణకు చూస్తే కనుక ఢిల్లీలో కాంగ్రెస్ ఓటమి పాలు అయింది. రాహుల్ గాంధీ మీద కేటీఆర్ ఈ సందర్భంగా పెట్టిన ట్వీట్ అయితే అభాసుపాలు అయింది అని అంటున్నారు.కాంగ్రెస్ బీజేపీని గెలిపించింది అన్నట్లుగా ట్వీట్ పెట్టి కంగ్రాట్స్ అంటూ రాహుల్ కి చెప్పడం మీద బీఆర్ఎస్ నే అంతా టార్గెట్ చేశారు. నిజానికి కాంగ్రెస్ బీజేపీల మధ్య జాతీయ స్థాయిలో ఎంతటి రాజకీయ వైరం ఉంటుందో అందరికీ తెలుసు. అలాంటిది ఈ ట్వీట్ల ద్వారా కేటీఆర్ కాంగ్రెస్ బీజేపీ ఒక్కటి అని చెప్పాలనుకోవడం రాజకీయ అతిగానే అంతా చూశారు. అందుకే అభాసు అయింది అని అంటున్నారు. దాంతో కేటీఆర్ ఈ రోజు మరో ట్వీట్ పెట్టి మరీ డిలిట్ చేశారు అని గుర్తు చేస్తున్నారు.ఇక చూస్తే కనుక తెలంగాణాలో బీజేపీ బీఆర్ఎస్ ఒకటి అని అంతా డిసైడ్ అయ్యారని అంటున్నారు. దానికి ఎన్నో నిదర్శనాలు ఉదంతాలు ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటిదాకా కేటీఆర్ కానీ బీఆర్ఎస్ నేతలు కానీ బీజేపీ మీద ఒక్క ట్వీట్ కూడా వేయలేదని గుర్తు చేస్తున్నారు.బడ్జెట్ సహా అనేక అంశాలలో తెలంగాణాను



కేంద్ర ప్రభుత్వం బీజేపీ అన్యాయం చేసినా వాటి మీద ఒక్క ట్వీట్ కూడా ఎందుకు ఉండదని ప్రశ్నిస్తున్నారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం లో చీమ చిటుక్కుమన్నా కూడా కేటీఆర్ ట్విట్టర్ హ్యాండిల్ బిగ్ సౌండ్ చేస్తుందని అంటున్నారు.ఈ విధంగా గులాబీ పార్టీ కమలం పార్టీల మధ్య తెర వెనక తెలియని బంధం ఉందా అన్న చర్చ కూడా సాగుతోంది. వాటి విషయం పక్కన పెడితే బీఆర్ఎస్ అధినేత కేటీఆర్ పెట్టే ట్వీట్ల వల్ల పార్టీకి వచ్చే పొలిటికల్ మైలేజ్ ఏదీ లేకపోగా మొత్తం బూమరాంగ్ అవుతోంది అని అంటున్నారు. ఒక వేలితో కాంగ్రెస్ ని నిలదీస్తే నాలుగు వేళ్ళు తిరిగి బీఆర్ఎస్ నే గుచ్చుతున్నాయని అంటున్నారు.ట్వీట్లతో వార్ చేయాలనుకుంటే దానికి కాంగ్రెస్ సిద్ధంగా ఉందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఇక జనాలు కూడా ఏమీ అమాయకులు కారని అంటున్నారు. వారు ఎవరి హయాంలో ఏమి జరిగింది అన్నది పూర్తిగా తెలుసుకునే ఉన్నారు.దాంతో కేటీఆర్ కానీ మరొకరు కానీ ముందు తమ పార్టీని ఉద్ధరించుకోవడం గ్రౌండ్ లెవెల్ లో బలోపేతం చేసుకోవడం బెటర్ కానీ తీరి కూర్చుని అధికార పార్టీపైన రాజకీయ విమర్శలు చేయాలనుకుంటే మాత్రం తాము ఉన్న కొమ్మను తెగ్గొట్టుకున్నట్లే అవుతుంది అని అంటున్నారు. మరి కేటీఆర్ ట్వీట్ల జోరు నెమ్మదిస్తున్నా లేక కంటిన్యూ అవుతుందా అన్నది చూడాల్సి ఉంది.

# సొంతింటి కలకు ప్రభుత్వాల మోకాలడ్డు



హైదరాబాద్,హైదరాబాద్ లాంటి నగరంలో కోటిన్నర లేనిదే ఓ అపార్ట్‌మెంట్ రావడం లేదంటే ఇది అభివృద్ధి అవుతుందా.. లేక సామాన్యులకు ఇల్లు అందుబాటులో లేకపోవడమా అన్నది ఆలోచన చేయాలి. రియల్ రంగం పూర్తిగా దెబ్బతింటోంది. ప్రజల్లో ఇల్లు కొనుక్కోవాలన్న ఆలోచన లేకుండా ప్రభుత్వా తీరు ఉంటోంది. భూముల ధరలు పెరగడం, రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెంచడం, ఇళ్లు అందుబాటులో లేకుండా పోవడం అన్నది అభివృద్ధికి సంకేతం కాదు. ఇది తిరోగమన చర్యగా చూడాలి. ప్రధానంగా రియల్ రంగంతో వేలాదిమంది ఉపాధి పొందుతున్నారు. వివిధ రకాల వృత్తులు దీనితో పెనవేసుకుని వున్నాయి. ఇందిరమ్మ ఇళ్ల పేరుతో కాలయాపన చేస్తూ...పోయేబదులు సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించాలి. ఇల్లు లేదా అపార్ట్‌మెంట్ కొనాలను కుంటున్న వారికి పన్నుల భారతం తడిసి మోపెడు అవుతోంది. ఇందులో జీఎస్టీ పదినుంచి 12 లక్షలు, రిజిస్ట్రేషన్‌కు ఓ పది నుంచి 20 లక్షలు కట్టాలంటే ఎంత భారం పడుతుందో ప్రభుత్వాలు ఆలోచించడం లేదు. తెలంగాణలో కెసిఆర్ పుణ్యమా అని లోన్‌పైనా 50వేల అదనపు పన్నులు వేశారు. రిజిస్ట్రేషన్ కార్యాలయాలు దోపిడీ కేంద్రాలుగా మారాయి. నిజానికి బడ్జెట్ పద్దులు ప్రజలను ఆదుకునేలా ఉండాలి. అందమైన ఎసి గదుల్లో కూర్చుని ఆలోచిస్తే ఎన్నటికీ అంటే 2047 నాటికి కూడా ప్రజల బతుకులు బాగుపడవని గుర్తించాలి. సామాజిక న్యాయం కేవలం రాజకీయ నినాదంగా మాత్రమే కనిపిస్తోంది.సామాజిక రుగ్మతగా మారిన వ్యవస్థీకృత అసమానతలను రూపుమాపుతున్నాం అన్న పదాలు వినడానికి బాగానే ఉంటాయి. గత పదేళ్లలో దేశ ఆర్థిక వ్యవస్థలో అనేక గుణాత్మక మార్పులు వచ్చాయని చంకలు గుద్దుకోవడంతో సరిపుచ్చితే మార్పు రాదు. పీఎం ఫసల్ బీమా యోజన కింద కోట్ల మంది రైతులకు పంట బీమా సాయం అందుతోందని బడ్జెట్‌లో చెప్పారు. నిజానికి దేశంలో ఎక్కడ ఎలాంటి పంటలు పండుతు న్నాయి. వాటికి ఎంత ఖర్చవుతుంది. రైతులు ఏంకోరుకుంటున్నారన్న చర్చ చేయడం లేదు. వ్యవసాయ చట్టాలు ఎత్తేశాక వాటి గురించి చర్చించడం లేదు. పన్ను వ్యవస్థలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల ట్యాక్స్ చెల్లింపుదారుల సంఖ్య పెరిగింది. ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం వల్ల పొదుపులు, పెట్టుబడులకు భద్రత ఏర్పడిందంటున్నారు. నిజానికి ఇదొక్కటే దేశాన్ని, ప్రజలను అగాధంలోకి నెట్టుతోందని ఎంత త్వరగా గుర్తిస్తే అంతమంచిది. ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చిందన్న మాటలు శుద్ధ అబద్ధం. ఆర్థిక వ్యవస్థ బలోపేతమై ప్రజలకు ఉపాధి లభించేలా ప్రజా ప్రయోజనాల కోసం అనేక కార్యక్రమాలు, పథకాలు రూపొందించాల్సి ఉంది. బ్యాంకులను సంస్కరించాల్సిన అవసరం ఉంది. అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా బడ్జెట్‌ను రూపొందించడం జరిగిందన్న విషయంలో అబద్ధాలను అందంగా చెప్పారు. 2014కు ముందు దేశం అనేక సవాళ్లను ఎదుర్కొందన్న ప్రధాన మంత్రి.. ఇప్పుడు పరిస్థితులు చక్కబడ్డాయని చెప్పడం మోసం చేయడం తప్ప మరోటి కాదు. పేదల అభివృద్ధే దేశ అభివృద్ధి. భారత ఆర్థిక వ్యవస్థ అభివృద్ధి చెందుతోందంటే వారు బాగుపడ్డ దాఖలాలు కనబడాలి. ఫ్రీ రేషన్‌తో ఆహార సమస్య తీరిందని పేర్కొనడంతోనే దేశం ఏ మేరకు అభివృద్ధి చెందిందో అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ ప్రజల ఆర్థిక వికాసం సాధ్యం అవుతోందని చెప్పకుండా ఉంటే బాగుండేది. కోట్లాది మంది రైతులకు నేరుగా నగదు బదిలీ చేస్తున్నామంటేనే వారికి తగిన గిట్టుబాటు ధరలు, వ్యవసాయ పనిముట్లు అందడం లేదని అర్థం చేసుకోవాలి. ఇన్ని సమస్యలను చర్చించకుండా బడ్జెట్‌లో అంతా బాగుందని చెప్పడం ద్వారా భారత్ అభివృద్దిలో దూసుకుని పోతోందని అంటే నమ్మడానికి ప్రజలు సిద్దంగా లేరని గుర్తించాలి.

# పోయిన వైసీపీ ఎంపీలు ఏమైనా మాస్ లీడర్స్ నా ?



అమరావతి,వైసీపీ నుంచి ఇప్పటికి నలుగురు ఎంపీలు బయటకు వెళ్ళారు. మరి కొందరు ఆ లిస్ట్ లో ఉన్నారు అని ప్రచారం సాగుతోంది. అయితే దీని వల్ల వైసీపీకి రాజకీయంగా దెబ్బ పడుతుందా అన్నది కూడా అంతా చర్చించుకుంటున్నారు. నిజానికి ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి ఇలాంటివి దెబ్బగానే చూస్తారు. కానీ అలా వెళ్తున్న వారు అంతా ఎవరు అన్నది కూడా చూస్తారు. మాస్ లీడర్లు ఎవరైనా పార్టీని వీడినపుడు అతి పెద్ద చర్చ అవుతుంది. వైసీపీలో చూస్తే కనుక వెళ్ళిన వారి గురించి వైసీపీ ఫ్యూచర్ గురించి చర్చ సాగుతోంది.

ఆర్ క్రిష్ణయ్య : ఇక ఒకసారి చూసుకుంటే వైసీపీ దారుణమైన ఓటమిని మూటకట్టుకుని ఎనిమిది నెలలు అయింది. ఈ మధ్యలో వైసీపీ నుంచి ఏకంగా నలుగురు రాజ్యసభ సభ్యులు పార్టీని వీడారు. వీరిలో ఆర్ క్రిష్ణయ్యది అసలు ఆంధ్రప్రదేశ్ కానే కాదు ఆయన తెలంగాణాకు చెందిన వారు. ఆయనను తీసుకుని వచ్చి వైసీపీ అధినేత జగన్ రాజ్యసభ సీటు ఇచ్చారు. కనీ ఆయన మాత్రం పార్టీ ఓడిపోగానే రాజీనామా చేశారు. తాను రాజకీయాలకు దూరంగా ఉంటానని బీసీ ఉద్యమాన్ని తిరిగి నిర్మిస్తాను అని చెప్పారు. అయితే చిత్రంగా ఆయన బీజేపీలో చేరడం ఆ పార్టీ తరఫున ఎంపీ కావడం అన్నది జరిగిపోయింది. ఈయన రాజీనామా వల్ల వైసీపీకి ఒక ఎంపీ సీటు తగ్గింది కానీ పార్టీ పరంగా రాజకీయంగా పెద్దగా నష్టం జరిగింది లేదనే అంటున్నారు. పైగా ఈయనకు ఓటు బ్యాంకు ఏపీలో లేదు అన్నది చెబుతున్న మాట.

బీద మస్తాన్ రావు : మరో వైపు చూస్తే బీద మస్తాన్ రావు అన్నాయన పార్టీని వీడిపోయారు. ఈయన బేసికల్ గా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు అక్కడ రాజ్యసభ సీటు కోసం ఎంతగానో ప్రయత్నం చేశారు. కానీ దక్కలేదు. ఆయన వైసీపీలోకి వచ్చి సీటు సాధించారు. ఇలా పార్టీ ఓడగానే అలా వైసీపీని వీడి మళ్ళీ టీడీపీలో చేరారు. ఆయన కూడా పార్టీ నుంచి మళ్ళీ అదే సీటు సాధించారు. ఈయన కు పెద్దగా అనుచర గణం లేదు. ఓటు బ్యాంక్ లేదు. పైగా బిజినెస్ మాన్. ఈయన వల్ల వైసీపీకి రాజకీయంగా ఇబ్బందులు ఉంటాయా అంటే సీటు పోవడం వేరేది ఉండదని అంటున్నారు.

మోపిదేవి వెంకటరమణ : అలాగే మోపిదేవి వెంకట రమణ వైసీపీ రాజ్యసభ సీటు ఇస్తే పార్టీని వీడి వెళ్ళారు. ఈయన 2014, 2019లలో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఓడినా మంత్రిని చేశారు. ఆ మీదట పెద్దల సభకు పంపించారు. అయితే ఎలాంటి విశ్వాసం లేకుండా ఆయన పార్టీని వీడి వెళ్ళిపోయారు. వరసగా రెండు సార్లు ఓడిన ఆయనకు ప్రత్యేకంగా ఓటు బ్యాంకు ఏమి ఉ ంటుంది అన్నది కూడా చర్చగా ఉంది.

విజయసాయిరెడ్డి : ఇక వి విజయసాయిరెడ్డి. ఈయన వైసీపీలో మొత్తం తానే అన్నట్లుగా వ్యవహరించారు. నిజానికి ఈయన పొలిటీషియన్ కానే కాదు. వైఎస్సార్ కుటుంబానికి ఆడిటర్ కాబట్టి జగన్ తో పాటుగా జైలుకు వెళ్ళారు కాబట్టి ఆయనకు ఎక్కువ విలువ ఇచ్చారు జగన్. ఈయన తాను పొలిటికల్ గా బిగ్ ఫిగర్ అనుకుని బయటకు వెళ్ళారని అంటున్నారు. తాను వెళ్తే తన వెంట చాలా మంది వస్తారని భావించారని చెబుతారు. అయితే ఏ ఒక్కరూ వెళ్ళలేదు. దాంతో ఆయన పప్పులో కాలు వేశారు అని అంటున్నారు. కొద్ది రోజుల పాటు విజయసాయిరెడ్డి రాజీనామా గురించి చర్చ సాగింది. కానీ ఇపుడు ఆయనను ఎవరూ పట్టించుకోవడం లేదు అన్నది చర్చగా ఉంది.ఇంకా పాత రాజకీయాలు అనుకుని జంపింగులు చేస్తే వారి వెనక ఎవరూ ఉండరని అంటున్నారు. ఇప్పుడున్న వారిలో చాలా మందికి వ్యక్తిగతంగా ఓటు బ్యాంక్ లేదు అన్నది విశ్లేషణ. ఎవరికైనా పార్టీ గుర్తు మాత్రమే గుర్తింపు ఇస్తోంది. వైసీపీకి చూస్తే 40 శాతం ఓటు బ్యాంక్ ఉంది. మాస్ ఫాలోయింగ్ ఉన్న లీడర్లు కనుక పార్టీకి జత అయితే మరో అయిదారు శాతం ఓటింగ్ పెరుగుతు ంది.ఇక రాజకీయాల్లో నాయకులు వస్తూంటారు పోతూంటారు. అది చాలా సాధారణం అయిన విషయంగా మారిన నేపథ్యంలో ఈ జంపింగులను చూసి వైసీపీ జడుసుకునేది లేదనే అంటున్నారు. ఆ పార్టీ ప్రజా పోరాటాలు జనాలతో ఉన్న కనెక్షన్ ఇవే ఎపుడూ చూడాల్సి ఉంటుంది అన్నది ఒక విశ్లేషణగా ఉంది.

# మరోమారు పడిపోయిన రూపాయి విలువ

న్యూఢిల్లీ,డాలరుతో పోల్చుకుంటే రూపాయి జీవన కాల కనిష్టానికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూలతలు, స్టీల్, అల్యూమినియంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం టారిఫ్ విధించడంతో దేశీయ సూచీలు నష్టాలతో మొదలయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 45 పైసలు క్షీణించి 87.88కి పడిపోయింది. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. గత శుక్రవారం ముగింపు (77, 860)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 450 పాయింట్లకు పైగా కోల్పోయి 77, 396కు పడిపోయింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 134 పాయింట్ల నష్టంతో 23, 425 వద్ద కొనసాగుతోంది. మిగిలిన ఆసియా మార్కెట్లు కూడా నేడు మిశ్రమంగానే కదలాడుతున్నాయి. సెన్సెక్స్‌లో బ్రిటానియా, కమిన్స్, ఎన్‌సీసీ, పేజ్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఆల్కెమ్ ల్యాబ్, వేదాంత, సెయిల్, ఆయిల్ ఇండియా షేర్లు నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 676 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 266 పాయింట్ల నష్టంతో ఉ ంది. డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలను, వాటి కరెన్సీలను ప్రభావితం చేస్తోంది. సోమవారం డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 44 పైసలు తగ్గి చారిత్రాత్మక కనిష్ట స్థాయి 87.9400కి చేరుకుంది. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కారణంగా ఈ తగ్గుదల సంభవించిందని చెబుతున్నారు. రూపాయి పతనం తర్వాత, భారత స్టాక్ మార్కెట్‌లో కూడా పెద్ద క్షీణత కనిపిస్తోంది. ముఖ్యంగా మెటల్ సెగ్మెంట్ షేర్లు భారీ క్షీణతను చూస్తున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం వల్ల సామాన్యుడి జేబుపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతి చేసుకున్న వస్తువుల ధర పెరుగుతుంది. దీని కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం



పెరిగే అవకాశం ఉంది. డాలర్ ధర పెరిగితే వస్తువులను దిగుమతి చేసుకోవడానికి మరిన్ని రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. రూపాయి విలువ పతనం వల్ల పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి ఖరీదైనదిగా మారుతుంది, దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవచ్చు.రూపాయి బలహీనపడటం వల్ల మొబైల్ ఫోన్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగవచ్చు. దీనికి తోడు, దిగుమతి చేసుకున్న ముడి పదార్థాల ధర కారణంగా, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది, ఇది వినియోగదారులపై ప్రభావం చూపుతుంది. విదేశాలలో చదువుతున్న విద్యార్థులకు, విదేశాలకు ప్రయాణించే విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, జీవన వ్యయాలు కూడా పెరుగుతాయి.రూపాయి విలువ పతనం కారణంగా, దిగుమతులపై ఆధారపడిన వ్యాపారాలకు సవాలు పెరుగుతుంది. ఎందుకంటే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చు లాభాల మార్జిన్‌లపై ఒత్తిడి తెస్తుంది. విదేశీ కరెన్సీలో రుణాలు తీసుకునే కంపెనీలు అధిక తిరిగి చెల్లించే ఖర్చులను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఎగుమతి చేసే వ్యాపారాలు, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, రత్నాలు, ఆభరణాలు వంటి రంగాలు విదేశాల నుండి డాలర్లలో చెల్లింపులను అందుకుంటాయి కాబట్టి కొంత ప్రయోజనం పొందవచ్చు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com